జూలై - 2025

# హన్నాకృప

ఆధ్యాత్మిక మాస పత్రిక

## విషయసూచిక


| | | |
|---|---|---|
| సంపాదకీయం | కె.ఇ. రాజేంద్ర | 02 |
| జప్పుత్వనేహు | కొడవటికంటి | 03 |
| నా చిత్తానుసారుడు | కొడవటికంటి | 05 |
| చెవిటిమాలోకం | కె.ఇ. రాజేంద్ర | 07 |
| మధ్యకాలము | హన్నాకృప డెస్క్ | 08 |
| నీ సృష్టికర్త | హన్నాకృప డెస్క్ | 09 |
| సామ్యేల్ రాజేంద్ర | సాక్ష్యము | 10 |
| మదర్‌తెరీసా | వై. ప్రసాద్‌రావు | 15 |
| తల్లిదండ్రులారా | హన్నాకృప డెస్క్ | 17 |
| నీతిగా ఎంచబడునది | డా॥ సుష్మ, నెల్లూరు | 19 |
| నా కుటుంబము | స్త్రీల కొరకు | 20 |
| కారు చీకటిలో... | చిన్నపిల్లల పేజి | 22 |
| బైబిల్ పదవినోదం-07 | | 24 |



**సంపాదకులు :**

**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర**
B.A.,B.L.,


**చందా వివరాలు :**
**సంవత్సర చందా రూ. 350/-**
పోషక చందా రూ. 1500/-
జీవితచందా రూ. 5000/-



**చిరునామా :**
ఎడిటర్, హన్నాకృప
పోస్ట్‌బాక్స్ నెం.51, క్లౌపేట, 6వలైను
ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా
సెల్ : 9440217726



**బ్యాంకు అకౌంటు వివరాలు :**
A/c Name: **K. Emmanial Rajendra**
A/c No.: **10957294340**
Bank: SBI Main Branch, Ongole
IFSC Code : SBIN0000890


సీరియల్ నంబరు

సంపాదకీయం....

# నీవు విలువపెట్టి కొనబడ్డావు

హన్నాకృప పాఠకులకు ప్రభువు నామమున వందనములు.

ఉదయం నిద్రలేచిన దగ్గర్నుండి పడుకోబోయే వరకు ప్రతిఒక్కరూ ఆలోచించేది వారి గురించే. వారి జీవితాన్ని ఎలా తీర్చిదిద్దుకోవాలో ప్రణాళికలు వేసుకోవడంతోనే రోజు గడచి పోతుంది. ఒక్కరోజైనా తనను సృజించిన సృష్టికర్తనుగాని, తను ఈ లోకానికి వచ్చిన ఉద్దేశ్యం గురించిగాని ఆలోచించరు. ఈ శరీరాన్ని వాళ్ళే తయారుచేసుకున్నట్లు భావించి, మట్టిలో కలిసిపోయే ఈ శరీరాన్ని ఎలా సుఖపెట్టాలా అని ఆలోచిస్తూనే ఉంటారు. విలాసవంతమైన భవనాలు, కార్లు, ఖరీదైన బట్టలు, శరీరం కష్టపడకుండా ఉండటానికి తగినంత సరంజామా, సుఖవంతమైన జీవితం జీవించటానికి అవసరమైనవన్నీ సమకూర్చుకోవడానికే సమయమంతా కేటాయిస్తారు. దేవుడిచ్చిన ఈ శరీరాన్ని ఈ లోకభోగాలు అనుభవించటానికి పెంచి పోషిస్తు న్నారు. మన శరీరంలో ఉండే భాగాలు ఏంటో మనకి తెలీదు. ఎంత రక్తం ఉంటుందో, ఎన్ని ఎముకలు ఉంటాయో, ఎంత మాంసము, ఎన్ని నరాలు ఉంటాయో, లోపల మన శరీర భాగాలు ఎలా పని చేస్తాయో తెలీదు. ఈ శరీరానికి ఏదైనా రోగం వస్తే కుయ్యో, మొర్రో అని ఏడ్చుకుంటా ఆసుపత్రికి పరుగెత్తడం తప్ప అసలు ఏ రోగము రాకుండా చేసుకోలేము. అయినా కూడా ఈ శరీరం మీద మనకే పూర్తి హక్కు ఉన్నట్లు ఈ శరీరం కోసం ఎంత హంగు, ఆర్భాటము చేస్తామో. మన శరీరంలో నివశిస్తున్న ఆత్మ గురించి ఒక్క క్షణం కూడా ఆలోచించలేనంతగా శరీరం గురించి ఆలోచిస్తుంటాము కదా! ఆ ఆత్మ మన శరీరంలో లేకపోతే శరీరం దేనికి పనికొస్తుంది? మట్టిలో కప్పి పెట్టకపోతే కంపుకొట్టే శరీరానికే కదా మనం విలువ ఇస్తుంది. చనిపోతే పనికిరాని ఈ శరీరం కోసమే కదా చనిపోయే వరకు కష్టపడేది. *"మన్నయినది వెనుకటివలెనే మరల భూమికి చేరును, ఆత్మ దాని దయచేసిన దేవుని యొద్దకు మరల పోవును" (ప్రసంగి 12:7).* దేవుడు దయచేసిన ఆత్మ మన శరీరములో ఉన్నంత వరకే మన శరీరానికి విలువ. ఈ శరీరముతో మనం చేసే పనుల వలననే మనం పరలోకము వెళ్ళాలా, నరకానికి వెళ్ళాలా అనేది నిర్ణయించబడుతుంది. ఆదాము చేసిన పాపం వలన వచ్చిన మరణము మానవుల్ని నరకపాత్రుల్ని చేసింది. మరణించిన తర్వాత ఏ మానవుడు నరకానికి వెళ్ళకుండా, పరలోకములో ఉన్న తండ్రి యొద్దకు తీసుకురావడానికి తన ఏకైక కుమారుడుని మానవుల పాపము నిమిత్తం సిలువలో బలిగా అర్పించాడు. పాపమునకు దాసులుగా ఉన్న మానవుల్ని విడిపించడానికి యేసుక్రీస్తు రక్తాన్ని వెలగా ఇచ్చి విలువపెట్టి కొన్నాడు. మన ఆత్మ నివశిస్తున్న ఈ దేహము మనది కాదు. ఈ దేహము మీద మనకు ఎలాంటి హక్కు లేదు. యేసుక్రీస్తు తన చివరి రక్తపు బొట్టు వెచ్చించి కొన్నాడు. అయితే మానవులు అది గ్రహించకుండా తమ జీవితాల్ని ఇంకా ఆ దాసత్వంలోనే ఉంచుతూ యేసుప్రభువు సిలువలో కార్చిన రక్తాన్ని వృధా చేస్తున్నారు. మనిషి తన శరీరాన్ని ఈ లోకానికి అప్పగించి, శరీరాశ, నేత్రాశ, జీవపు డంబమునకు లోనై తనకు తానుగా తన శరీరాన్ని నరకానికి అప్పగించుకుంటున్నాడు. కాబట్టి మట్టిలో కలిసిపోయే ఈ శరీరానికి మహిమ తీసుకురావాలంటే, ఈ భూమ్మీద మన దేహముతో దేవుని పని చేసి ఆయనను మహిమపరచాలి. అందుకు నీవు సిద్ధమా?

**- కొడవటికంటి ఇమ్మానియేల్ రాజేంద్ర, ఎడిటర్**

**K. Emmanial Rajendra, SBI Main Branch, Ongole**
**A/c No. 10957294340**

సీరియల్

# జప్నత్పనేహు

**(యోసేపు జీవిత చరిత్ర)**



**– కొడవటికంటి**

నైలునది అంతా జనమైపోయింది. నింపియోపోలీస్ పట్టణానికి మనుష్యులను భరించలేనంత భారమైపోయింది. ఫరో యొక్క రథాధిపతులు, సైన్యాధిపతులు, పదాతిదళం అంతా నిండిపోయారు. ఫరో, యోసేపు కలసి ఒకే రథంలో ఆలయం వద్ద ఆగారు. లోనికి వెళ్ళిన తర్వాత అక్కడ తతంగం అంతా అరగంటలో పూర్తిచేసుకొని, ఎత్తయిన ఒక అరుగు మీదకు వచ్చారు. ఫరో చెయ్యి యోసేపు భుజం మీద ఉంది. దాదాపు ఆ ఓను దేవాలయ ప్రాంగణమంతా ఇసుక వేస్తే రాలనంత జనంతో నిండిపోయింది. ఆ ఎత్తైన అరుగు చుట్టూ జనం నిలబడే చూస్తున్నారు. సైన్యం వారిని క్రమబద్ధం చేసింది. దూరంగా యాజకుని ఇంటి మిద్దె మీద జనం నిండిపోయి చూస్తున్నారు. ఆ జనంలో ముందు భాగాన బల్లమీద కూర్చొని చూస్తుంది ఆసెనతు. ఆ అరుగు మీదకు వచ్చిన తర్వాత యోసేపు మాటిమాటికి ఓను యాజకుని ఇంటివైపు చూడటం ఫరో గమనించాడు.

సంగీత వాయిద్యాలు మ్రోగుతున్నాయి. ఫరో తన చేయి పైకెత్తినప్పుడు వాయిద్యాలు ఆగిపోయినవి. జనం నిశ్శబ్దంగా ఉన్నారు. అప్పుడు ఫరో యోసేపును తీసుకొని, అరుగు మధ్యలోనున్న ఇంకా ఎత్తయిన వేదిక మీదకు నడిచాడు. ఫరో తన చేతినున్న ఉంగరం తీసి యోసేపు చేతికి పెట్టాడు. యాజకుడు పెద్ద గిన్నెలోనున్న వస్త్రములు ఫరో యొద్దకు తీసుకొని వచ్చాడు. సన్నని నారబట్టలు. ఇవి ఐగుప్తులోనే నేయబడినవి. ఎంత పల్చగా ఉన్నాయి అంటే అవి ధరించిన తర్వాత ముందుగా ధరించిన వస్త్రముల రంగు మారినట్లుగా కనబడుతున్నవి. కాని క్రొత్త వస్త్రములు ధరించినట్లుగా ఉండదు. ఫరో స్వయంగా సన్నని నార వస్త్రపు అంగీని యోసేపు భుజముల మీదుగా దించాడు. అవి ఫరో కొరకు తయారు చేయబడినవి. తర్వాత తన మెడలోని బంగారు గొలుసు తీసి యోసేపు మెడలో వేశాడు. తర్వాత ఇద్దరూ కలసి ఆ అరుగు దిగి క్రిందకు వచ్చారు. అక్కడ ఓను సన్నిధిలో అంతవరకు నిలబెట్టబడి ఉన్న ఫరో యొక్క రెండవ రథముకు ఆరు గుర్రాలు కట్టబడియున్నవి. రథం ఠీవిగా నడుస్తూ వచ్చింది. ఆ గుఱ్ఱాలు కాషాయ రంగు గలిగినవి. అటువంటి గుర్రాలు ప్రపంచంలో ఎక్కడా దొరకవు. వాటివలన సంతానోత్పత్తి జరిగించబడదు. ఎందుకంటే ఫరోతో పాటే అవి కూడా ఫరో సమాధిలోకి నడిపించబడతాయి. ఫరో తిరిగి పునర్జన్మలో తన శరీరంలోకి వచ్చినప్పుడు ఈ గుర్రాలను కూడా వాడుకుంటాడు. అది ఐగుప్తీయుల నమ్మిక.

మొదటి రథం సింహాసనాసీనుడైన ఫరోది. రెండవది ఫరో వ్యక్తిగతమైనది. ఇప్పుడు తన చేతి ఉంగరం యోసేపు చేతికి పెట్టడం ద్వారా, తన మెడలోని గొలుసును అతని మెడలో వేయడం ద్వారా, తన రెండవ రథం మీద యోసేపును ఎక్కించటం ద్వారా, ఐగుప్తుదేశం మీద తన ఆధిపత్యమును యోసేపుకు ఇచ్చి వేయటం పూర్తయ్యింది. యోసేపు రథం ఎక్కినప్పుడు అతని రథం ముందు యాభై మంది పరుగెత్తుటకు సిద్ధంగా ఉన్నారు. వారు ఒక్కసారిగా "వందనము చేయండి" అని దిక్కులు పిక్కటిల్లేటట్లు అరిచారు. అప్పుడు యోసేపు రథం దిగి ఫరో యొద్దకు వచ్చాడు. అప్పుడు ఫరో, యోసేపుతో "ఫరోను నేనే. ఐనను నీ సెలవు లేక ఐగుప్తు దేశమంతటను ఏ మనుష్యుడును తనచేతి నైనను, కాలినైనను ఎత్తకూడదని" చెప్పాడు.

తర్వాత ఫరో యోసేపును వదలి తనకై ఏర్పాటు చేయబడిన వేదికనెక్కి ఉదయం నుండి జరిగిన సంగతులు ప్రజలతో చెప్పి, యోసేపు పేరు 'జప్నత్పనేహు'గా మార్చి ఇక మీదట నుండి జప్నత్పనేహుగానే పిలవాలని ప్రజలందరికి ఆజ్ఞాపించాడు. జప్నత్ప అనగా మర్మములను ఛేదించువాడని అర్థము.

సాయంకాలం తన ఇంటికి తిరిగి వచ్చేటప్పటికి ఫేమాను తన కొరకు వేచి యున్నాడు. అక్షాపు, ఫేమానుని విడిపించి తీసుకొని వచ్చాడు. అతని మీద ఉన్న తప్పిదములన్నీ ఉపసంహరింపబడినవి. ఐగుప్తు దేశమంతటా ధాన్యం

నిలవచేయుటకు ధాన్యము నిలువచేయు గిడ్డంగులు ప్రతి పట్టణంలోను ప్రతి గ్రామంలోను కట్టడములు ప్రారంభించ బడును. అవన్నియు థేమాను కార్యనిర్వహణలో నిర్మించ బడతాయి. థేమానుకి మంత్రి హోదా కల్పించబడింది. థేమాను క్రింద ప్రతి పట్టణంలోను, ప్రతి గ్రామములోను ధాన్య నిల్వల అధికారులు నియమింపబడెదరు. ఇప్పుడు థేమాను పూర్తిగా ఐగుప్తు దుస్తులలో ఉన్నాడు. కొంచెం సేపటికి వారు భోజనానికి కూర్చుండబోయేటప్పుడు, అక్షాపు మరియొక రాజలేఖకునితో కలసి జప్నత్పనేహు కొరకు రాజుగారి యొద్ద నుండి తాకీదులతో వచ్చాడు. జప్నత్పనేహు, థేమాను ఆశ్చర్యపోయారు. ఇప్పుడే రాజసన్నిధి నుండి వచ్చియుంటే, అప్పుడే తాకీదులు ఎందుకు? అన్నట్లు చూసారు. అక్షాపు చాలా సంతోషంగా ఉన్నాడు. తనకు తెలియనట్లుగా లోపల గదిలోకి వెళ్ళాడు. జప్నత్పనేహు ఆ తాకీదు తీసుకొని దానిమీద ముద్రింపబడియున్న రాజముద్రికను చూసి మరి ఆశ్చర్యపోయాడు. థేమాను వచ్చి, ఆ పత్రిక తీసి పెద్దగా చదివాడు.

“మహాచక్రవర్తి అయిన ఫరో తమ ప్రజలకును, సామంతులకును ప్రేమించి వ్రాయునది. దేవుని దయ మీ అందరికీ కలుగునుగాక! ఈరోజు ఉదయమున మాకు కలిగిన కలవరమును, తన దేవుని శక్తి వలన మర్మములను బయలుపరచుట ద్వారా మా మనస్సునకు సంతోషమును, ఈ దేశమునకు మేలు కలుగజేసిన జప్నత్పనేహును గౌరవించి, అభిమానించి, ఈ దేశ ప్రజల తరపున ఐగుప్తునకు మారుపేరైన ఆసెనతుతో తర్వాత రోజున ఓను సమక్షమున వివాహం జరుప నిశ్చయించడమైనది. అందరూ ఆహ్వానితులు.”

జప్నత్పనేహు తను కూర్చున్న పీఠం నుండి కదలలేదు. తల ఎత్తి చూడలేదు. అందరు మౌనంగా ఉన్నారు. జప్నత్పనేహు సంతోషంగా ఉన్నాడో, లేదో ఎవరూ ఊహించలేక పోతున్నారు.

మరునాటి తెల్లవారుజామున వియాన్ని తీసుకొనివచ్చి, జప్నత్పనేహు ఎదురుగా నిలబడితే, వియాన్ ఇప్పుడు మొదట చూసినంత సుకుమారముగా లేదు. వడగాలికి ఎండిపోయిన మొక్కవలె ఉన్నాడు.

“వియాన్ ఏదైనా అవసరమైన పని మీద ఉన్నావా? వెంటనే వెళ్ళాలా?” అని అడిగాడు జప్నత్ప.

“నిన్ననే వెళ్ళవలసింది. కాని ఐగుప్తు అంతా కోలాహలంగా ఉంటే, రేపటి వేడుకలు చూసి వెళ్ళాలి అనుకొని అందరం ఆగిపోయాము. ఒంటెలు, మనుష్యులు అందరూ గోషెనులో ఉన్నారు. ఎల్లుండి వరకు ఏమి తొందరలేదు. సరుకు అంతా అమ్మివేసి బయలుదేరే రోజున, ఇక్కడి వస్త్రాలు బరువులుగా ఎత్తుకొనవలసి ఉంది” అన్నాడు.

జప్నత్పనేహు ఆలోచించి, దగ్గరగా వచ్చి, భుజం మీద చేయి వేసి “నువ్వు వెళ్లి, ఈసారి వారితో కలసి సిరియా రావటం లేదని చెప్పు. మరలా వారు తిరిగి వచ్చిన తర్వాత వారితో కలసి పోవచ్చును” అని అన్నాడు.

“అలాగే” అన్నాడు వియాన్.

ఇద్దరు సైనికులను తోడు ఇచ్చి, వియాన్‌ను గోషెనుకు పంపిస్తూ “ఉదయాన్నే వచ్చేయ్, వివాహ సమయానికి నీవిక్కడ ఉండాలి” అన్నాడు. **(సశేషం)**


**ఫోన్‌పే ద్వారా లేదా గూగుల్ పే ద్వారా పత్రిక చందా పంపించాలంటే క్రింది క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి**

Scan & Pay Using PhonePe App

Emmanial Rajendra

సీరియల్

33

# నా చిత్తానుసారుడు

**(దావీదు జీవిత చరిత్ర)**

**- కొడవటికంటి**

"జీపులో వున్నప్పుడు అంత రాత్రి ఒంటరిగా వచ్చాడు" అన్నాడు ఏడుస్తూనే.

"మరి ఆయన ప్రేమ అటువంటిది. నీకంటే పదిహే నేళ్ళు పెద్దవాడైనా స్నేహంలో నీకంటే పది సంవత్సరాలు చిన్నవానిగా మాట్లాడతాడు" అన్నాడు అబీషై.

దావీదు కళ్ళ వెంబడి నీరు ఆగకుండా ప్రవహిస్తుంది. "వాటిని ఆపాలని అనుకోలేదు. నీవు భయపడవద్దు, నీవు ఇశ్రాయేలీయులకు రాజువవుదువు అన్నాడు" అని అబీషై ముఖంలోకి చూస్తూ "ఆ మాట నాకు నచ్చలేదు. నా కంటె పెద్దవాడు నా కంటే యోగ్యుడు నాకు సహకారిగా ఎలా ఉంటాడు, ఉండకూడదు అనుకున్నాను. ఇప్పుడు అలాగే జరిగింది" అని ఎక్కిళ్ళు పెట్టాడు.

మరునాడు దాదాపు వెయ్యిమంది సిక్లగుకు వచ్చారు. లోపల గదిలో కూర్చున్న దావీదు దగ్గరకి బెనాయా వచ్చాడు. దావీదు తలెత్తి చూచాడు. బెనాయా వంగి వందనము చేసాడు. బెనాయా ముఖం చాలా సంతోషంగా కనిపించింది. ఆనందంతో పాటు ఆశ్చర్యము కూడా తొంగిచూస్తుంది.

"ఏం బెనాయా" అన్నాడు.

"తమరి దర్శనార్థం పల్లెల నుండి పట్టణాల నుండి వచ్చిన చాలామంది వేచి ఉన్నారు" అన్నాడు.

దావీదు లేచి నిలుచున్నప్పుడు అబీగయీలు పైవస్త్రము తీసుకొని వచ్చింది. దావీదును ఎప్పుడు కనిపెట్టుకొని ఉంటుంది. ఆమె ముఖంలో ఎప్పుడూ దయ, కరుణ స్థిరనివాసం చేస్తుంటాయి. అనేక ఇబ్బందులలో దావీదు ఆమె ముఖం చూసినప్పుడు హృదయంలో ప్రశాంతత. ప్రక్కనే అయిదు సంవత్సరాల దానియేలు తల్లివలెనే బహు నిదానస్తుడు. తల్లి దగ్గర ఉంటే చాలు ఇక ప్రపంచంలో ఎవరూ అవసరం లేదంటాడు. నాబాలు చనిపోయిన వెంటనే అబీగయీలు దావీదు భార్య అయింది. కాపురానికి వచ్చిన తొమ్మిది నెలలకే దానియేలు జన్మించాడు. దావీదుకు ఒక అనుమానం ఉండేది. దానియేలు తన వాడా? కర్మేలీయుడైన నాబాలు వాడా? అని. కొంచెం ఎదిగితే కాని పోలికలు మాట్లాడవు అందుకని కిల్యాబు అని పేరు పెట్టారు. కిల్యాబుకు నాలుగు సంవత్సరాలు వచ్చిన తర్వాత అంతా దావీదు ముఖంలో నుండి ఊడిపడ్డాడా అనిపిం చాడు. అప్పుడు కిల్యాబుకు దానియేలు అను పేరు పెట్టాడు. అనగా దేవుడు న్యాయాధిపతి అని అర్థము.

దానియేలును ఎత్తుకొని ముద్దు పెట్టుకొని అబీగయీ లుకు అప్పజెప్పి బయటకు నడిచాడు. పట్టణం మధ్యలో సమావేశమైన జనులందరూ తనకు తెలిసినవారే. వీరందరి గ్రామాలలోను, హెబ్రోనులోను, పట్టణములలోను సంచ రించి యుండినవాడే.

తాను సిక్లగు నుండి బయలుదేరి అమాలేకీయులను హతముచేసి వచ్చినప్పుడు కలిగిన విస్తారమైన దోపు సొమ్ము పశువుల మందలను దాదాపు పన్నెండు పట్టణాలలోని తన శ్రేయోభిలాషులకు పంపించాడు. ఇప్పుడు వారందరు తమ బంధుమిత్రులతో కలసివచ్చారన్నమాట అని అనుకుంటూ వారిని సమీపించగానే అందరూ కోలాహలంగా లేచి నిలు చున్నారు. కొందరు పెద్దలు దావీదును ఆలింగనం చేసు కున్నారు. వారందరూ ద్రాక్షాగెలలు అంజూరపు అడలు, ధాన్యము, పిండి, ద్రాక్షారసతిత్తులు విస్తారంగా తమ కొరకు తీసుకొని వచ్చారు.

దావీదు ఆశ్చర్యపోయాడు. ఎంతో కాలం ఆలోచిస్తేనే కాని ఇలా ఈ సామాగ్రిని సిద్ధపరచటం అసాధ్యం అను కున్నాడు. వీరందరూ ఇప్పట్లో మరలా తిరిగి తమ తమ ప్రదేశాలకు తిరిగి వెళ్ళరని నిర్ధారణ అయింది. కొంత సేపటికి ఆశాహేలు దావీదు తల్లిదండ్రులను మోయాబు రాజు వద్ద నుండి తీసుకొని వచ్చాడు.

సాయంకాలం భోజనాలైన తర్వాత ముఖ్యులైనవారు ఇరవైమంది దావీదుతో సమావేశమయ్యారు. సౌలు చని పోయిన తరువాత ఏర్పడుచున్న పరిస్థితులను గురించి యెర హ్మెరీయులు దావీదును వెంటనే రాజుగా సిక్లగులోనే అభిషేకించాలని పట్టుపట్టారు. బేతేలీయులు బేతేలును రాజధానిగా చెయ్యాలని అన్నారు. ఏది తేలకుండానే సభ ముగించారు. దావీదు ఈ సంభాషణలో ఏమి జోక్యం చేసుకోలేదు.

ఒక ప్రక్క యోనాతాను మరణం. మరో ప్రక్క భవిష్యత్ కార్యక్రమం. ఇంతమంది జనులతో సిక్లగు నిండిపోయింది. వీరి బరువు బాధ్యతలు అహీనోయము పర్యవేక్షణలో ఆశా హేలు నిర్వహిస్తున్నాడు. సిక్లగు చిన్న గ్రామం. ఇప్పటికి వేలసంఖ్యలో జనులు గ్రామం నిండా చేరారు. అయితే వచ్చేవారు వీరులైనా, బంధుమిత్రులైనా విస్తారమైన ఆహార పదార్థాలను, గొఱ్ఱెలను ద్రాక్షారసమును తమతో తీసుకొని వస్తూనే ఉన్నారు.

దావీదు ఇంటికి వచ్చే వరకు అబీగయీలు కనిపెట్టు కొని వుంది. అబీగయీలును చూడగానే మౌనియైయున్న దావీదులో చలనం వచ్చినట్లుగా ఉంది. ఎదురు వచ్చిన దానియేలును ఎత్తుకొని లోనికి ప్రవేశించాడు.

ఉదయం కాగానే అబీషై అబ్యాతారును వెంటబెట్టు కొని వచ్చాడు. దావీదుకు చాలా సంతోషం కలిగినది. నిన్నంతా అబ్యాతారుకాని, అబీషైకాని కనబడలేదు. అబీషైకి బేత్లెహేమును రాజధానిగా చేయాలని ఎంతో ఆశగా ఉన్నది.

పూజ గదిలోకి వెళ్ళిన తర్వాత అబ్యాతారు ఏఫోదును ధరించి నిలుచున్నాడు. దావీదు ఎదురుగా మోకాళ్ళ మీద వుండి దేవుని ప్రార్థించాడు. అంతా నిశ్శబ్దం.

"యూదా పట్టణాలలోనికి నేను పోదునా?" అని అడిగి మౌనంగా కూర్చున్నాడు. అబీషై ప్రక్కనే మోకాళ్ళ మీద ఉన్నాడు.

"పోవచ్చును" అన్న మాట అబ్యాతారు పెదవుల నుండి వెలుబడింది.

"నేను పోవలసిన స్థలమేది?" అన్నాడు దావీదు.

"హెబ్రోను" అన్నాడు అబ్యాతారు.

దావీదు మనస్సు తేలికైంది. దావీదు బయటకు వచ్చేటప్పటికి బయట గుమికూడిన విస్తారమైన ప్రజలు ఒక్కసారిగా హర్షధ్వానాలు చేశారు.

"హెబ్రోను, హెబ్రోను" అనే మాటలు, అరుపులు. అబీషై తన పెద్ద తమ్ముడు యోవాబును పిలిచి వెంటనే హెబ్రోను బయలుదేరి రేపు అక్కడికి జనులు చేరేటప్పటికి చేయవలసిన ఏర్పాట్లు గురించి మాట్లాడాడు. హెబ్రోనును స్వాస్థ్యముగా పొందినప్పుడు ఒత్నీయేలు కట్టించిన పెద్ద ప్రాకారములు కలిగిన భవంతులన్నీ శుభ్రము చేయించి వుంచాలని చెప్పాడు.

ఇశ్రాయేలీయులు మొదటి న్యాయాధిపతి ఒత్నీయేలు పరిపాలించిన పట్టణం. పితరుల సమాధులు వుండిన స్థలం. అబ్రాహాము నిద్రిస్తున్న ప్రదేశము హెబ్రోను. ఇక్కడ నుండి ప్రయాణమైపోయిన యోసేపు ఐగుప్తునకు ఏలిక అయ్యాడు. అబీషై హృదయం గంతులు వేస్తుంది. తన మేనల్లుడు దావీదు ఇప్పటివరకు తనతో తమలో ఒకడు. అక్కడ హెబ్రోనులో ఒక రాజు.

పదిహేను మైళ్ళ ప్రయాణం. దావీదును గుఱ్ఱం మీదకు ఎక్కించారు. పెద్ద ఊరేగింపు చేస్తూ హెబ్రోను వచ్చారు. బేత్లెహేము నుండి ఆశాహేలు, కెతాబు, యెప్తోలు వచ్చారు. దావీదుకు ఆశాహేలు అంటే చాలా ప్రేమ. తన అక్క పిల్లలందరిలో అశాహేలు అంటే ఇష్టం.

ఇంట్లో అబీగయీలు దగ్గరకి వచ్చి రెండు బిందెల నీళ్ళు ఇచ్చాడు. "అమ్మా బేత్లెహేము గవిని యొద్ద బావినుండి తెచ్చాను" అన్నాడు.

అబీగయీలు అలానే చూస్తుండిపోయింది.

"ఔనమ్మ, ఆయనకు ఆ వూరి నీళ్ళంటే చాలా ఇష్టం. ఆ నీళ్లు ఉంటే చాలు. ఆయనకు ఇంకేమి అవసరం లేదు" అన్నాడు ఆశాహేలు. అబీగయీలు ఆ నీళ్ళబిందెలు ఇంటిలో పెట్టించింది. ఆమె వద్ద ఇప్పుడు ముగ్గురు పనికత్తెలు ఉన్నారు. **(సశేషం)**



# 'చెవిటి మాలోకం'



చెవిటి వాళ్ళతో మాట్లాడాలంటే చాలా విసుగొస్తుంది కదా! మనం ఒకటి చెప్తే వాళ్ళకి ఇంకోలా వినపడుతుంది. పెద్దగా అరిచి చెప్పాలి, లేదంటే సైగలు చేయాలి. సరే, పాపం నిజంగా చెవిటి వాళ్ళ అయితే వాళ్ళని చూచి జాలిపడాలి. మరి బాగా వినపడినా కూడా మాట వినని వాళ్ళని ఏమనాలి? పదే పదే చెప్పినా మాట వినని  వాళ్ళని ఏమంటారు? వాడంతే, చెప్పినా వినిపించుకోడు, వాడికి చెప్పడమంటే చెవిటి వాడి ముందు శంఖం ఊదినట్లే అని అంటాము కదా! చెవిటివాడికి, చెప్పిన మాట వినని వాడికి పెద్ద తేడా ఏముంటది? వాడికి వినపడదు, వీడికి వినపడుతుంది కానీ చలనం ఉండదు. దేవుడి విషయంలో అందరి పరిస్థితి అంతే, దేవుని మాట వినే వాళ్ళే లేరు. అందరూ చెవిటి మాలోకాలే. ఆదాము దగ్గర్నుండి నేటి మానవుని వరకు ప్రతిఒక్కరూ మాట వినని చెవిటివాళ్ళే. 'నా మాట వినండి, నా మాట వినండి' అని దేవుడు ఎంత అరిచి మొత్తుకున్నా కూడా ఎవ్వరూ దేవుని మాట వినకపోవడానికి కారణం ఏంటి? వినపడకనా, దేవుడంటే లెక్కలేని తనమా? *"ఈ ప్రజలు కన్నులారా చూచి, చెవులారా విని, హృదయముతో గ్రహించి మనస్సు త్రిప్పుకొని నా వలన స్వస్థత పొందకుండునట్లు వారి హృదయము క్రొవ్వినది వారి చెవులు వినుటకు మందములైనవి" (మత్తయి 13:13-15).* కాబట్టి మనం దేవుని మాట వినకపోవడటానికి, వినిపించుకోకపోవడానికి కారణమేంటో దేవుడే చెప్పేశాడు. మన హృదయానికి క్రొవ్వుపట్టి ఆ క్రొవ్వు చెవుల్లోకి దూరటం వలన దేవుని మాట వినటం లేదు. మనకి ఊహ తెలిసినప్పటి నుండి చర్చికి వెళ్ళి దేవుని వాక్యం వింటాము, టీ.వి.లో, సువార్త సభలలో, యూట్యూబ్‌లో ఎప్పుడు కావాలంటే అప్పుడు దేవుని వాక్యం వింటాము. అయినా కూడా మనం ఎందుకు మారటం లేదంటే, విన్న వాక్యం మన చెవుల్లోకి దూరుతుంది కానీ మన హృదయంలోకి పోకపోవడానికి మన హృదయానికి పట్టిన క్రొవ్వు అడ్డుపడుతుంది. కుంటి, గ్రుడ్డి, మూగ, చెవిటి వాళ్ళని చూసి మనం జాలిపడతాము. దేవుడు ఎందుకు వీళ్ళని ఇలా పుట్టించాడని బాధపడతాము. దేవుడు మనకి చెవులు ఇచ్చినందుకు మనమేమన్నా దేవుని మాట వింటున్నామా? ఒకవేళ దేవుడు ఎవరినైనా చెవిటి వారిగా పుట్టించి వుంటే, వాళ్ళకి వినబడదు కాబట్టి వాక్యం వినకుండా, మనసు మారకుండా వుంటే వాళ్ళని క్షమించి పరలోకరాజ్యంలోకి అనుమతిస్తాడేమో కానీ, చెవులు బాగా వినబడుతూ, వాక్యం వింటూ మారని వాళ్ళకి మాత్రం పరలోకరాజ్యంలోకి ప్రవేశం ఉండదు. మన శరీరంలో ప్రతి అవయవం ఒకటి కంటే ఎక్కువ పనులు చేస్తాయి. కానీ, చెవులకు మాత్రం వినడమనే ఒక్కటే పని. ఒక్కటే చెవి వుంటే 'నాకు వినబడలేదని' చెప్తామనేమో రెండు చెవులిచ్చి *"కాగా మీరు నా మాట శ్రద్ధగా విని, నా నిబంధనననుసరించి నడిచిన యెడల..." (నిర్గమ. 19:5)* అని పెద్దగా అరచి మైకులో చెప్పినా మనకు వినబడక పోతే మనకంటే **'చెవిటి మాలోకాలు'** ఇంకెవరూ ఉండరు. 'మారండి, మారండి, మీరు మారకపోతే నాశనమై పోతారు' అని దేవుడు చెప్పే మాటలు మనకి వినబడటం లేదంటే దేవుని మాటలు వినబడనంత దూరం వెళ్ళిపోతున్నాం. దేవునికి ఇంకా ఇంకా దూరమైపోయి  మన నాశనాన్ని మనం కొని తెచ్చుకోక ముందే హృదయానికి పట్టిన క్రొవ్వుని వాక్యం ద్వారా కరిగించు కుంటే చెవులు బాగా వినబడి శిక్ష నుండి తప్పించుకోగలం. *"వినుటకు చెవులు గలవాడు వినును గాక" (మార్కు 4:9).*

**ఫోన్‌పే లేదా గూగుల్ పే ద్వారా పత్రిక చందా పంపవలసిన ఫోన్ నంబరు**

**9 4 4 0 2 1 7 7 2 6**

# మధ్యకాలము

ఆంటనీ రోమా పట్టణమునకు వెళ్ళిన తరువాత అరిస్టోబులస్ కుమారుడైన అంటనిగోనస్ పార్థియనులను మంచి చేసికొని తనను యూదయ సింహాసనము ఎక్కిస్తే వారికి వెయ్యి తలాంతుల ధనము, దేశములో ఎనిమిది వందల మంది సౌందర్యమైన యువతులను ఇస్తానని చెప్పి యెరూషలేము మీద దండెత్తి ఏ మాత్రము కష్టము లేకుండా సింహాసనము నధిష్టించి ఫయిజల్‌ను, హెరియస్‌ను ఇనుప సంకెళ్ళతో బంధించి చెరసాలలో వేశాడు. హేరోదు అయితే ఆ చీకటిలో తప్పించుకొని తన తల్లిని,సోదరిని, భార్యను భార్య తల్లిని అనేకమంది స్నేహితులను, బంధువులను అప్పోలలస్ తీరమునున్న దుర్భేధ్యమైన మసాడా కోటలో చేర్చి తన తమ్ముడైన యోసేపును వారికి కావలిగాయుంచి తన సహాయం అడుగుటకు రోమా బయలుదేరాడు.

ఈ సమయంలో ఆంటిగోనస్ యూదయకు రాజుగా ప్రకటించుకొని దేశమును ఏలనారంభించాడు. పార్థియనులు హెర్కనస్‌ను, ఫయిజల్‌ను ఆంటిగోనస్‌కు అప్పచెప్పారు. తనకు సంభవించనున్న అవమానకరమైన మరణమును ఊహించిన ఫయిజల్ చెరలో తల పగులునట్లు గోడకు కొట్టుకొని మరణించాడు. ఆంటిగోనస్, హెర్కనస్ యొక్క రెండు చెవులు కోసి, అతను మరలా ప్రధానయాజకునిగా ఉండుటకు వీలు లేకుండా చేసి అతనిని పార్థియనులకు అప్పగించాడు. పార్థియనులు వారి తిరుగు ప్రయాణములో అతనిని సెలూసియలో వదలి వెళ్ళారు.

హేరోదు ఆంటనితో తనకు తన తండ్రికి అతనితో ఉన్న సహవాసమును ఆసరాగా తీసికొని ఆంటనీకి గొప్ప ధనము ఇచ్చేటట్లుగా ఒడబడి ఏడు రోజులలో తను యూదయకు రాజుగా అభిషక్తునిగా సెనేటు యొక్క సమ్మతి పొంది ఆంటిగోనస్ రోమకు శత్రువుగా తీర్మానము చేయించాడు. వెంటనే హేరోదు బయలుదేరి టోలమిరేవులో ఓడదిగి అక్కడున్న రోమా కాల్బలమునకు సెనేట్ ఉత్తర్వులు చూపించి యొప్పే తీరమును స్వాధీనపరచుకొని మసాడాలో ఉన్న తన వారిని తీసికొని రెస్సాకోటను నాశనము చేశాడు.

రోమా సైన్యాధిపతులైన వెన్‌టీడియస్, సెలోలు ఆంటిగోనస్ ద్వారా గొప్ప సొమ్ము లంచముగా తీసికొని హేరోదు యెరూషలేము మీదకు వచ్చుటకు ఆటంకము లేర్పరచాడు. అయితే ప్రస్తుతమునకు గలిలయ పొందిన హేరోదు కొంత వరకు సంతృప్తి చెంది ఎఫ్రాటిస్ నది ప్రక్కన ఉన్న సామోసాటిస్ పట్టణమును ముట్టడి వేయుచున్న ఆంటనీ యొద్దకు వెళ్ళి వెంటడియోస్, సీలో చేసిన ద్రోహము గురించి వివరించాడు. హేరోదు సామోటోస్ పట్టణము వెళ్ళునపుడు తన తమ్ముడైన యోసేపును తన రాజ్యమును కాపాడుటకు మాత్రము నియమించగా అతను దానికి వ్యతిరేకంగా యెరికోను ముట్టడించి ఆ యుద్ధములో వధించబడ్డాడు. అతని సైన్యమంతయు ముక్క ముక్కలుగా నరకబడ్డారు. ఈ విధంగా హేరోదు మరలా గలిలయను పోగొట్టుకొన్నారు.

హేరోదు అడిగినవన్ని మార్కు ఆంటనీ ఇచ్చాడు. హేరోదు సైన్యముతో యెరూషలేము వచ్చాడు. మొదట్లో సైన్యం అంతగా సహకరించక పోయినా, హేరోదు గాయపడినప్పటికీ తన తమ్ముని చంపిన వారి మీద పగతీర్చుకున్నాడు. సాపస్‌ను, ఆంటిగోనస్ యొక్క సైన్యాధిపతిని వధించాడు. సైన్య మంతటినీ నాశనము చేశాడు.

రోమా సైన్యాధిపతియైన సోసియస్ సహాయముతో యెరూషలేమును అనేక నెలలు ముట్టడి వేశారు. రోమా సైనికులు యెరూషలేమును లోపరచుకొని కొల్లసొమ్ము సంపాదించుకొని పురుషులను స్త్రీలను పిల్లలను చంపవలెనని యెరూషలేమును పూర్తిగా నాశనము చేయవలెనని యున్నారు. ఆ విధంగా జరిగించియుండే వారే కాని, హేరోదు వారికి విస్తారమైన ధనము ఇచ్చినందున ఆ పరిస్థితి తప్పించబడినది.

ఆంటగోనస్ చివరకు సాసోనస్‌కు లొంగిపోయాడు. సాసోనస్ అతనిని బంధించి హేరోదు యొద్దకు తీసికొని వచ్చాడు. హేరోదు సాసోనస్‌కు గొప్పధనము లంచముగా ఇచ్చి హెర్మానస్‌కు మరణదండన ఏర్పరచాడు. ఈ విధంగా 129 సం॥ల చరిత్ర గలిగిన హాస్మోనియస్ వంశము యొక్క ఆఖరి మొక్క త్రుంచబడింది. **(సశేషం)**

# నీ సృష్టికర్త

మానవశరీరం సంక్లిష్ట నిర్మాణం. కొన్ని కోట్ల కణాల సముదాయం. మరి ఇటువంటి మహత్తర కణసముదాయం పనిచేయాలంటే  కొంత శక్తి అవసరం. మరి ఆ శక్తి ఉత్పన్నమయ్యే మైటోకాండ్రియా అనే అతి చిన్న కణభాగం ఈ సంచిక ధ్యానాంశం.

శరీరంతో చేసే అన్ని పనులకు కావలసిన శక్తి ప్రతి కణంలో ఉండే అతి చిన్న భాగమైన మైటోకాండ్రియాలో ఉత్పన్నమౌతుంది.

మైటోకాండ్రియా రెండు రకాల పొరలు కలిగిఉంటుంది. బయటపొర నునుపుగా ఉంటుంది. లోపలి పొర అనేక మడతలు కలిగి ఉంటుంది. ఈ మడతలలో ఉండే ద్రావణం ఒక ప్రత్యేకమైన కణాలు కలిగి ఉంటుంది. ఈ కణాలు నోటిద్వారా శరీరంలోకి ప్రవేశపెట్టబడిన  ఆహారం నుండి కావలసిన మినరల్స్‌ను తీసుకొని వాటిని శక్తిగా మారుస్తాయి. ఈ శక్తిని ఏ.టి.పి అంటారు. ఈ శక్తి మైటోకాండ్రియాలో నిక్షిప్తమై ఉంటుంది. అవసరమైనప్పుడు  ఆ శక్తి వినియోగించబడుతుంది.

మైటోకాండ్రియాకి ప్రత్యేకమైన  డి.యన్.ఎ ఉంటుంది. అంటే డి.యన్.ఎ కలిగిన కణం ఎలాగైతే జీవం కలిగి స్వయంగా విచ్ఛిత్తి, అభివృద్ధి వంటివి చేస్తుందో అలాగే మైటోకాండ్రియా కూడా తన సొంత డి.యన్.ఎ కలిగి స్వయంగా అభివృద్ధి చెందుతుంది. అంటే  శక్తి ఎక్కువగా అవసరమైన  కండర కణాలలో మైటోకాండ్రియా తనకు తానే అభివృద్ధి చెందుతుంది. తద్వారా ఎక్కువ శక్తి అభివృద్ధి చెందిన మైటోకాండ్రియాలలో నిక్షిప్తం చేయబడుతుంది.

మానవ శరీరంలో ఉన్న ప్రతి కణంలోను మైటోకాండ్రియా ఉంటుంది. కాబట్టి మానవ శరీరంలో ఎన్ని కణాలుంటాయో  అంతకంటే ఎక్కువ మైటోకాండ్రియాలు ఉంటాయి. సాధారణంగా ఒక మనిషిలో లక్ష ట్రిలియన్ మైటోకాండ్రియాలు ఉంటాయి.

మైటోకాండ్రియా డి.యన్.ఎ  కణకేంద్రకంలో ఉండే డి.యన్.ఎ వలె కాక వలయాకారంలో ఉంటుంది. ఇందులో కేవలం 37 జీన్స్ మాత్రమే ఉంటాయి.

ఈ మైటోకాండ్రిను కణం యొక్క పవర్‌హౌస్ అంటారు.

కణంపని చేయుటకు కావలసిన శక్తి ఈ మైటోకాండ్రియా అందిస్తుంది. అంటే శరీరానికి కావలిసిన శక్తి ఈ కణభాగ నుండే అందుతుంది.

మైటోకాండ్రియా  ఏ.టి.పి (ఎడినోసిన్ ట్రైపాస్ఫేట్) రూపంలో శక్తిని తయారుచేస్తుంది. ఈ అణువులు శక్తిని కావలసిన కణభాగానికి తీసుకెళ్తాయి. తద్వారా కణాలు, కణసముదాయాలు, కణజాలలు. కండరాలు ఆ శక్తిని ఉపయోగించుకొని కదలికలు ఏర్పడతాయి.

ఈ విషయాలను జాగ్రత్తగా గమనించినట్లయితే మానవ శరీరమంతా మెదడు నుండి కాలిబొటనవేలి వరకు ఉన్న ప్రతి కణంలోను శక్తి ఉత్పన్నమౌతుంది.

మరణం అనంతరం కూడా కొంత సమయం వరకు మైటోకాండ్రియా జీవించే ఉంటుంది. అంటే శరీరంలో శక్తి ఉత్పన్న ప్రక్రియ మనం చనిపోయాక కూడా  కొనసాగు తుందన్నమాట.

మన ప్రమేయం లేకుండా కనీసం మన గ్రహింపునకు రాకుండా నిరంతరం మానవ శరీరంలో జరిగే ఈ శక్తి ఉత్పత్తి ప్రక్రియ ఎంతో బృహత్తరమైనది. ఒకరకంగా మనిషిని  నడిచే పవర్‌స్టేషన్ అనవచ్చు.

సైన్స్ ఎంతో అభివృద్ధి చందిన ఈ రోజుకు కూడా సమాధానం లేని ఎన్నో ఆశ్చర్యకార్యాలకు, అధ్భుతాలకు నిలయమైన ఈ మానవదేహం కలిగిన ప్రతి మనిషి ధన్యుడు. అయితే తన దేహానికున్న ప్రత్యేకతను గుర్తించిన నాడే ఆ ధన్యతకు అర్థం చేకురుతుంది.

దేవుని నిత్యశక్తిని. శక్తి సామర్థ్యాలను లేశమాత్రంగానైనా ఊహించగలిగిన రోజు మానవుడు తాను ఉచితంగా పొందిన అద్భుతమైన శరీరాన్ని బట్టి దేవునికి కృతజ్ఞత కలిగి జీవించడానికి  ఇష్టపడతాడు. అట్టి జ్ఞానాన్ని దేవుడు మన పాఠకులందరికి దయచేయును గాక!

# సాక్ష్యము కొడవటికంటి సామ్యేల్ రాజేంద్ర

2000 సంవత్సరం జనవరి 10వ తేది నా కళ్ళు పచ్చగా ఉన్నాయని యింటికి దగ్గర్లో ఉన్న రాంబాబు డాక్టరుగారి దగ్గరకు వెళ్ళాను. రక్తము 2 శాతం మాత్రమే ఉంది అని మందులు వ్రాశారు. పది రోజుల్లో నయమైంది.

ఫిబ్రవరి 8న మరలా నా కళ్ళు పచ్చగా ఉన్నాయిని చెప్పి ఆసుపత్రికి వెళ్ళాను. పసికర్లు వచ్చిన వాళ్ళంతా భయపడి చస్తారు. డాక్టరు వద్దకు వెళ్తే కఠినమైన భోజన ఆంక్షలు పెట్టి మజ్జిగ మాత్రమే త్రాగి ఉండాలని అంటారు. శరీరంలోని జబ్బును ఎదుర్కోటానికి శక్తి ఆహారంలో వస్తుంది. అదే తగ్గిపోతుందులే అని డాక్టరు దగ్గరకు వెళ్ళకుండా, పథ్యం చేయకుండా నెల రోజులు వున్నాను.

ఒకరోజు మధ్యాహ్నం నా స్నేహితుడు గవర్నమెంటు హాస్పిటల్లో కంటి వైద్యుడైన డాక్టరు మురళి వచ్చి, నా కళ్ళు చూచి ఆశ్చర్యపోయాడు. నెల రోజుల నుండి నువ్వు నన్ను చూడటానికి రాలేదు. సంగతి ఏమిటో కనుక్కుందామని వచ్చాను అన్నాడు. వెంటనే ఆయన బండి మీద గవర్నమెంటు హాస్పిటల్‌కి తీసుకెళ్ళి నన్ను చేర్పించాడు. నెల రోజులు అక్కడ ఉన్నాను కాని ఏ మాత్రం నయం కాలేదు. నా తమ్ముడు జోషి ఇంటికి తీసుకొని వచ్చి స్టేషన్ దగ్గర వున్న చలపతి అనే నాటువైద్యుని పిలిపించాడు. ఆయన నెల రోజులు వైద్యం చేశాడు. ప్రతిరోజు గంధం నూరించి ముద్దలు మింగించేవాడు. ఇంకా ఏవో చూర్ణాలు మింగించాడు. కడుపు రోజురోజుకి పెరిగి పెద్దదై ప్యాంటు వేసికోలేక పోయాను.

అక్కడ నుండి నల్లూరి నర్సింగ్ హోమ్‌కి వెళ్ళాను. అప్పటికి నాలుగు నెలలు గడిచిపోయాయి. నర్సింగ్ హోమ్ వారు ఒక నెల మందులు వాడి మద్రాసుకాని హైదరాబాద్ కాని అపోలో హాస్పిటల్‌కి వెళ్ళండి ఇక్కడ నయం కాదు అన్నారు. కాని నేను ఆ ప్రయత్నమే చేయలేదు. అపోలోకి వెళ్ళాలంటే ఎంత తక్కువ అయినా 50 వేలు అవుతుంది. నేను అప్పు చెయ్యను, చందా అడుగలేను. అప్పటికి నాకు 60 సంవత్సరాలు. సగం ప్రపంచం తిరిగాను. స్వదేశంలో ముప్పాతిక భాగం చూశాను. ఆరు నవలలు రాశాను. 9 మంది పిల్లలు వున్నారు. వారందరూ పెద్దవాళ్ళయి ఎవరి కాళ్ళ మీద వాళ్ళు బ్రతుకుతున్నారు. ఇంక నేను చనిపోయినా అంతగా బాధపడే వాళ్ళు ఎవరూ లేరు. అప్పు చేసి చచ్చిపోతే ఎంత అసహ్యం?

మా తమ్ముడు జోషి తన కారు ఇచ్చి కొద్దిగా డబ్బు ఇచ్చి హైదరాబాద్ పంపించాడు. ఆ డబ్బుతో అపోలో గేటు వద్దకు కూడ పోలేము. హైదారాబాద్ నుండి తిరిగి వచ్చిన తర్వాత ఇంకా బలహీనమయ్యాను. ఇంట్లో మనుష్యులు ఒక ప్రక్క పిలిస్తే ఇంకొక ప్రక్కకి పోతున్నారు. అయిదు నెలలు మంచంలో వున్నవారు ఎవరైనా ఆప్తులకు బరువే. నేనైనా అంతేకదా! చనిపోయిన మా అమ్మ గుర్తుకు వచ్చేది. రాత్రులు పెద్దగా అరిచే వాడిని. మా అమ్మ వెళ్లిపోయి హాయిగా వుంది. మా నాయన అమ్మ ఇద్దరు హాయిగా వెళ్లిపోయారు. ఇప్పుడు నా కడుపునిండా కత్తులు వున్నట్లుగా ఉండేది. అటు కదిలినా ఇటు కదిలినా విపరీతమైన నొప్పి.

నాకు మొదటిసారి జాండిస్ వచ్చినప్పుడు జనవరిలో పరీక్ష చేసిన రాంబాబు దగ్గరికి సాయంకాలం 6 గంటలకు వెళ్ళాను. ఆయన మూత్రంపట్టి తెమ్మన్నాడు. చీకటి పడుతుంది. నేను మూత్రంపట్టి డాక్టరు దగ్గరు తీసుకెళ్తున్నాను. డాక్టరు దూరం నుండి ఆ మూత్రం రంగు చూసి అక్కడే పెట్టు అని, నా కుమారుని లోపలికి తీసుకెళ్లి వెళ్లి మీ నాన్న రెండు రోజులకంటే ఎక్కువ బ్రతకడు, ఇంక పరీక్షలు అవసరం లేదు అని పంపించాడు. 13 సంవత్సరాలు క్రితం ఆ డాక్టరు మా నాయనను పరీక్షించి గుండె పెద్దదయింది. ఇంక రెండు నెలల కంటే ఎక్కువ బ్రతకడు అని చెప్పాడు. అలానే మా నాయన చనిపోయాడు. ఇప్పుడు నేను రెండు రోజులకంటే ఎక్కువ బ్రతకనని చెప్పాడు.

ఇంటికి వచ్చిన తర్వాత ఆ సంగతి అందరికి తెలిసి పోయింది. నేను రెండు రోజులే బ్రతుకుతానని. వెంటనే నా కుమారుడు డబ్బు తేవడానికి బెంగుళూరు వెళ్ళాడు. చనిపోయే ముందు నన్ను చూడటానికి దూర ప్రాంతాల నుండి బంధువులు స్నేహితులు రావటం ప్రారంభించారు. నేను ఏ మాత్రం ఆలోచించటం లేదు. భయపడలేదు, దిగులుపడలేదు.

మా ప్రక్క నాలుగంతస్తుల ఇల్లు మా తమ్ముడు జోసఫ్ ఇంట్లో ఎప్పుడూ ఎవరో ఒకరు ఇద్దరు, పదిమంది, పాతిక మందైనా తెల్లవాళ్లు వుంటారు. వారిలో ఇద్దరు ఆడవాళ్లు

ఉన్నారు. వారిలో ఒకామెకు స్వస్థతవరం వుందంట. కాని ఆమెను ప్రార్థన చెయ్యమని అడుగలేదు. పైగా యేసుప్రభువుకు రికమండేషనా అనుకునే వాడ్ని. ఆయన చిత్తమైతే బ్రతుకుతాను లేకుంటే లేదనుకునేవాడిని. ఆ ఉదయం ప్రక్కింట్లో వున్న అమెరికా ఆమె జానెట్ 'నేను వచ్చి ప్రార్ధన చేసేదా?' అని కబురు చేసింది. సంతోషంగా రండి అని కబురు చేశాను కాని ఆమె రాలేదు.

మరునాడు సాయంకాలం మిద్దెమీద పిట్ట గోడకి మంచం ఆనిచ్చి కూర్చుని క్రిందకు చూస్తున్నాను. ఎదురుగా మా చర్చి తలుపులు మూసి వున్నాయి. చీకటి పడుతుంది. పిట్టగోడమీద తొట్లలో పూలచెట్లు వున్నాయి. నేను చర్చిని చూస్తున్నాను. నాకు పెద్ద కడుపు, పెద్ద లివర్. అంతలో భళ్ళున చర్చి తలుపులు తెరచుకొని జానెట్ బయటికి వచ్చింది. ఆమె వెంట నలుగురు ఆడవాళ్ళు వున్నారు. ఆమె వాళ్ళతో ఏదో మాట్లాడుతున్నది. నిన్న ఈమె వస్తానని చెప్పింది ఎందుకు రాలేదో అనుకున్నాను. ఇంతలో ఒక చిన్న పిల్లవాడు వచ్చి 'తెల్ల దొరసాని నీకు ప్రార్థన చెయ్యటానికి వస్తుంది' అన్నాడు. 'సరే రమ్మను' అని చెప్పి, నేను చర్చి వరండాలో నిలబడి వున్న జానెట్‌ని ఆ పల్లెటూరు ఆడవాళ్లని చూస్తూ ఉన్నాను.

అంతే నేను లేచి ఒక ఇంట్లోకి ప్రవేశించాను. లోపల పెద్ద హాలు. మధ్య తరగతి కుటుంబీకుల ఇల్లు. బీదవారు కాదు గొప్పవారు కాదు. కుడిప్రక్కకు చూశాను. అక్కడ యేసు ప్రభువు వున్నాడు. నేను ఇంటి లోపలికి వచ్చి కుడిప్రక్కకు చూసినప్పుడు యేసుప్రభువు యూదులు భోజనం చేసే పద్ధతిలో కూర్చుని వున్నాడు. ఎడమ చేతిమీద ఆనుకుని ఎడమవైపుకి పండుకున్నట్లుగా గోడకు కాళ్లు చాపి కుడిచేత్తో రొట్టె తింటున్నాడు. రొమ్మున ఆనుకొనిన శిష్యుడు, అనగా యేసుప్రభువు భోజనానికి పైవిధంగా కూర్చున్నప్పుడు యేసుప్రభువుతో మాట్లాడాలంటే యేసుప్రభువు రొమ్ముకు తన వీపు తగిలేటట్లుగా తిరగాలి. పరిసయ్యుని ఇంట్లో ప్రభువు ఈ విధంగానే భోజనమునకు కూర్చునప్పుడు పాపాత్మురాలైన స్త్రీ ఈ విధంగా భోజనానికి కూర్చుని వున్న యేసు పాదమును కన్నీటితో కడిగింది.

యేసుప్రభువు ఆ విధంగా రొట్టెతింటూ, నేను లోపలికి వచ్చినప్పుడు తలెత్తి నన్ను చూశాడు. 'వచ్చావా?' అన్నట్లుగా చూచి ఆ హాలు మధ్యలో చాప మీద కూర్చుని వున్న ఒక వ్యక్తితో ఏదో సీరియస్‌గా మాట్లాడుతున్నాడు. నేను నా తల త్రిప్పి ఆ వ్యక్తిని చూడలేదు. యేసుప్రభువు మీద నుండి నా కళ్లు త్రిప్పలేదు. కొంచెంసేపు నిలుచున్నాను. కడుపు ఎత్తుగా, కాళ్ళు చేతులు సన్నగా, కడుపు బరువుగా నొప్పి పుట్టింది. అక్కడే చూస్తూ కూర్చున్నాను. అప్పుడు ప్రభువు తలత్రిప్పి నన్ను చూసి మరలా ఆ హాలులో వున్న వ్యక్తితో ఏదో భాషలో మాట్లాడుతున్నాడు. నాకు ఆ భాష అర్థంకాలేదు.

అంతలో నేను లోనికి వచ్చిన దారినే ఒక స్త్రీ నాకు, ప్రభువుకు మధ్యగా వచ్చి మరొక రొట్టె ఆయన ప్లేటులో పెట్టి వెళ్లింది. ఆమె కాళ్లు మాత్రం చూశాను. ఆమె ముఖం చూడలేదు. కాని వెంటనే ఆమె పేతురు అత్త అని, ప్రభువుకు పరిచర్య చేస్తుందని, ప్రభువు మాట్లాడుతుంది పేతురుతో అని, ఇది పేతురుగారి ఇల్లు అని గ్రహించాను.

తర్వాత ప్రభువు పరుపు మీద నా ఎదురుగా ఐదు అడుగుల దూరంలో కూర్చుని నన్ను చూస్తున్నాడు. నేను కూడ ఆయన ముఖాన్ని చూశాను. చిన్న గడ్డం, బలమైన శరీరం, గుండ్రని లేత ముఖం 30 సం॥ల యౌవనస్తుడు. తెల్లని అంగీ కొంచెం ఆకుపచ్చ రంగు. చాలాసేపు ఆయన కళ్ళలోకి చూస్తున్నాను. ఆయన కూడ నన్ను కన్ను ఆర్పకుండా చూస్తున్నాడు. దాదాపు పది నిమిషాలు ఏం మాట్లాడకుండా ఒకరినొకరం చూసుకుంటున్నాం. ప్రభువు నా గురించి ఏమి ఆలోచిస్తున్నాడో కాని, నేను మాత్రం ఆయన రూపురేఖలు చూస్తూ ఈయనది జపాన్ ముఖమా, చైనా ముఖమా? ఏదీ కాదు మన ముఖమే. ఆసియా వాసుల ముఖమే అని అలా ఆలోచిస్తున్నాను.

తర్వాత ఆయన లేచి నేను వచ్చిన వాకిట్లో గుండా వెళ్తున్నాడు. నేను లేచి ఆయనను అనుసరించాను. నా వెనుక పేతురుగారు వస్తున్నాడు. కాని నేను యేసు మీద నుండి నా కళ్లు త్రిప్పలేదు. సాయంకాలం సూర్యుడు ఆయన వీపు మీద పడుతున్నాడు. ఇంట్లో లేతపచ్చరంగులో వున్న అంగీ ఇప్పుడు సూర్యకిరణాల వల్ల ముదురు ఆకుపచ్చరంగుకు వచ్చింది. ఇంటి ప్రక్కగా ముగ్గురం నడుస్తున్నాము. ఇంటి ముందు భాగమున పెద్ద వీధి. పట్టణమంతయు ఆ యింటి వాకిట కూడియున్నది. ఆయనను చూడగానే అంతా లేచి నిల్చున్నారు. కాని ఎవరూ గోల చెయ్యటం లేదు. ఇంటి చుట్టూ చెక్క ఫెన్సింగ్ వుంది. ఇంటిముందు గేటు ఎదురుగా ప్రభువు నిలుచున్నాడు. నేను ఆయన ఎడమ ప్రక్కన నిలుచున్నాను. నా ఎడమ ప్రక్కన పేతురుగారు నిలుచున్నాడు. అయినా

నేను పేతురుగారి ముఖం చూడలేదు. ప్రభువు ముఖం నుండి నా కన్నులు త్రిప్పలేదు. ఆయన తల త్రిప్పి నన్ను చూశాడు. నేను వెళ్ళి మా ఎదురుగా వున్న పెద్ద గేటు పైన వేయబడిన గడియ తీసి ప్రభువు వైపు చూస్తూ వచ్చి మామూలుగా ఇందాక నిలబడివున్న చోటనే నిలుచున్నాను. గేటులో నుండి లోనికి వచ్చిన ఒక యౌవనస్తుడు ప్రభువు ఎదురుగా నిలబడ్డాడు. ఆయన తన రెండు చేతులు ఆ యౌవనస్తుని కణతల మీద పెట్టి, తల పైకెత్తి చూస్తున్నాడు. ఎడమ ప్రక్కన నిలుచున్న నేను ఆయన ముఖం చూస్తూ నాలాగా యేసుప్రభువును ఇలా దగ్గరగా నిలిచి చూసే భాగ్యం లోకంలో ఎవరికీ కలుగలేదు అనుకున్నాను. ఆ రోగియైన యౌవనస్తుని రోగమంతా ప్రభువు తన శరీరంలోనికి తీసుకుంటు న్నాడు. ఆ యౌవనస్తుని ముఖం ఇప్పుడు తేటగా మారింది. ప్రభువు చేతులు అతని మీద నుండి తీస్తూ నావైపు చూశాడు. అతను స్వస్థత పొందినవాడై ప్రభువు కుడివైపుగా లోపలకి వెళ్ళాడు.

ఇంతలో చాలమంది మనుష్యులు పెద్ద పెద్దగా మాట్లాడుకుంటూ ధనధనమని మెట్లు ఎక్కుతున్న శబ్దం వినిపించి నా తలతిప్పి ఎడమవైపుకు చూశాను. నేను కూర్చున్న మంచము వెనుక క్రింద నుండి పైకి మెట్ల మీదుగా జానెట్ పైకి వచ్చింది. ఆమె వెనుక సూసన్, స్టామ్రాట్, పాస్టర్లు పైకి వచ్చారు. వారిని ముందు రానీయకుండా జానెట్ వారికి అడ్డంగా నిలబడి నావైపు వింతగా చూస్తుంది. ఆమె నన్ను అంతకుముందు చూచి ఉండ లేదు. ఆమె అలా ఎందుకు చూస్తుంది? అక్కడే ఎందుకు నిలబడిపోయింది అనుకుంటూ నా రెండు పాదాలు, కాళ్ళు, నా చేతులతో ఎత్తి ఇవతల పెట్టి లేచి నిలబడి ఆమె వైపుగా నడవడం ప్రారంభించాను. ఆమె వెంటనే కదిలి, నా వైపు వస్తూవుంది. కాని ఆమె మెడవంచి, కళ్ళు పైకెత్తి నన్ను పరీక్షగా చూస్తూ నా దగ్గరకు వస్తూఉంది.

ఈమె అలా ఎందుకు చూస్తూ వస్తుంది? అనుకుంటూ నేను కదిలాను. మేము ఒకరికొకరం దగ్గరగా వచ్చినప్పుడు ఆమె నా కళ్ళలోకి కళ్ళు పెట్టి చూస్తూ 'ఇప్పటిదాకా నువ్వు ప్రభువు ఎదురుగా నిలబడి ఆయన కళ్ళలోకి చూస్తున్నావు కదూ!' అంది. ఔను కదా నేను ప్రభువు ముఖం చూస్తూ ఉన్నాను కదా అనుకున్నాను. "నువ్వు ప్రభువును చూస్తున్నావు. నేను కూడా మీ ఇద్దరిని చూశాను, కానీ నేను ప్రభువు వీపు మాత్రం చూస్తున్నాను. నువ్వు ఆయన ముఖం చూస్తున్నావు. ఈ లోకంలోని మరెవరూ ప్రభువు ముఖం చూడలేదు. నువ్వైతే నీ యీ కళ్ళతో ఆయనను చూస్తున్నావు. నేను వెనుక భాగం చూశాను ఆయన ముఖం చూడలేదు. నువ్వు ధన్యుడవు" అన్నది.

నేను లోపలికి నడచి సోఫాలో కూర్చుని నా ఎదురుగా వున్న కుర్చీలు చూపించి వారిని కూర్చోమన్నాను. ఆమె వెంటనే 'నేను కూర్చోను నువ్వు ప్రభువును చూశావుగా' అన్నది. అందరూ నిలబడే ఉన్నారు. ప్రార్థన చెయ్యమని అడిగాను ఆమెని. 'నేను చెయ్యను, నువ్వు ప్రభువును చూశావుగా అన్నది. ఆమె ఎందుకు ప్రార్థన చెయ్యనంది అనుకుంటూ వుంటే, ఆమె దగ్గరగా వచ్చి 'నీ కాళ్ళు కడుగుతాను' అంది. నేను ఆశ్చర్యపోయి స్టామ్రాట్‌ని 'ఈమె రోగికి ప్రార్థన చేసేముందు వాళ్ళ కాళ్లు కడుగుతుందా?' అని అడిగాను. 'లేదు పెదనాన్న, ఈమెతో గత పదిరోజులుగా తిరుగుతున్నాము, ఆమె ఎవరి కాళ్ళూ కడగలేదు' అన్నాడు. మేము తెలుగులో మాట్లాడు కుంటుంటే నాకు ఇంగ్లీషు రాదనుకొని ఆమె స్టామ్రాట్ వైపు తిరిగి 'నేను మీ పెద్దనాయన కాళ్ళు కడుగుతానని ఆయనకి చెప్పండి' అన్నది. 'ఆయనకు ఇంగ్లీషు వచ్చు' అన్నాడు స్టామ్రాట్. నా కూతురు పెద్ద బేసిన్, ఓ జగ్గుతో నీళ్ళు తెచ్చి నా పాదాల మీద నీళ్ళు పోస్తుంటే జానెట్ నాకు ఎదురుగా నేలమీదకు వంగి నా రెండు మోకాళ్ళ నుండి పాదాల వరకు కడిగి లేచి నా ప్రక్కగా వచ్చి తన కుడి చేయి నా కుడి భుజం మీద వేసి నిలబడింది. మీరు ఏ దేశం నుండి వచ్చారు, ఎంతకాలం వుంటారు, మీ వయస్సెంత మొదలైన ప్రశ్నలు అడుగుతుంటే ఆమె జవాబు చెప్పి 'ఇక వెళ్తాము' అన్నది. 'ప్రార్థన చేసి వెళ్లండి' అన్నాను. 'లేదు, నువ్వు నీ కళ్ళతో ప్రభువును చూశావు' అని ప్రక్కకి వెళ్ళి నా కుమార్తె ఆమె చేతుల మీద నీళ్లు పోస్తుండగా సబ్బుతో చేతులు కడుక్కుని వెళ్ళిపోయింది.

పెద్ద కడుపు, సన్నని కాళ్ళు చేతులతో నాకు ఏమి స్వస్థత కలుగలేదు. కదిలితే కడుపులో కత్తులు గుచ్చుకున్న నొప్పి. నా తమ్ముడు కొంతడబ్బు యిచ్చాడు. మరుసటిరోజు హైదరాబాద్ వెళ్ళి పరీక్ష చేయించుకొని వెంటనే ఒంగోలు రావాలి అనుకున్నాను. ఉదయాన్నే నా స్నేహితుడు డా॥ కృపారావుని చూసి సాయంకాలం హైదరాబాదు వెళ్ళాలి. ఉదయం 8 గంటలకు డా॥ కృపారావుగారి హాస్పిటల్‌కి వెళ్ళాము. అక్కడి నర్సులు ఇద్దరు నా దగ్గరకి వచ్చి 'ఇంత కడుపు అయ్యేదాకా వుండి, ఇప్పుడు చావటానికి మా ఆస్పత్రికి

వచ్చావా' అని కోపంగా అన్నారు. 'అదికాదు కృపారావు నా స్నేహితుడు. ఆయనను చూడటానికి వచ్చాను' అన్నాను. అందుకు వారు 'ఆయన ఆ చివరి గదిలో వుంటారు, ఆయన చాలాకాలంగా పేషెంట్స్‌ని చూడటంలేదు, ఆయన కుమారుడు కేశవబాబు చూస్తున్నారు' అని చెప్పారు. నేనింత వరకు కేశవబాబును చూడలేదు. ఆయన గదిలోకి వెళ్ళి 'నేను మీ తండ్రిగారి స్నేహితుడను, ట్రీట్మెంట్ కోసం రాలేదు, నా పరిస్థితి ఎలా వుందో తెలుసుకుందామని వచ్చాను' అని చెప్పాను.

అందుకు ఆయన 'మీరు లోపలికి వచ్చేటప్పుడే చూశాను, మీరు రెండురోజుల కంటే ఎక్కువకాలం బ్రతకరు' అని 'అయినా మీరు హైదరాబాద్ వెళ్ళాలనుకుంటే డా॥ నాగేశ్వరరెడ్డిగారి వద్దకు వెళ్ళి ప్రయత్నించి చూడండి. పంజాగుట్టలో మెడినోవా వ్యాధి నిర్ధారణ కేంద్రం అది అన్నాడు. 'సరే, రిఫర్ చేయండి, హైదరాబాద్ వెళ్ళాలను కుంటున్నాం' అని చెప్పాను. 'ముందు మీ రైల్వే రిజర్వేషన్ టిక్కెట్టు చూపండి అప్పుడు వ్రాసి ఇస్తాను' అన్నాడు. రైల్వేస్టేషన్ ప్రక్కనే వుండటం వలన అరగంటలో రిజర్వేషన్ చేయించాం. డా॥ కేశవబాబు దగ్గర లెటర్ తీసుకొని ఆ రాత్రే హైదరాబాదు బయలుదేరాం. నేను హైదరాబాద్ రావటం అక్కడే వున్న నా వాళ్ళెవరికీ సంతోషం కలిగించలేదు. అయినా నా దగ్గర వున్న డబ్బుతోనే పరీక్షలు చేయించుకోవడంతో ఎవరినీ నేను ఎప్పుడూ డబ్బులు అడగనని తెలుకున్నారు. పంజాగుట్టలోని మెడినోవాకు ఉదయం 10-30 గంటలకు వెళ్ళాము. 950 రూపాయలు కట్టించుకొని గదిలోకి తీసుకెళ్ళి నోట్లో ఒక ఇనుపగొట్టం పెట్టి వెలుగుతున్న రెండు చిన్నబల్బులు నా కడుపులోకి దించి కంప్యూటర్‌తో ఫోటో తీశారు. తర్వాత సాయంకాలం మూడు గంటల వరకు ఎన్నెన్నో పరీక్షల కొరకు అనేకచోట్లకు తీసుకొని వెళ్ళారు.

చివరలో ఎక్కడో ఒక గదిలో కూర్చున్న డా॥ నాగేశ్వర రెడ్డిగారి వద్దకు తీసికొని వెళ్ళారు. ఆయన చేతిలో నా పరీక్షల కాగితాల కట్ట వుంది. ఆయన వాటిని చూస్తూ, నేను లోపలికి రాగానే 'ఇవన్నీ మీ పరీక్షల కాగితాలు, ఇవికాక మీరు 15 రోజుల క్రితం ఒంగోలులో స్కానింగ్ చేయించిన కాగితాలు వున్నాయి. ఒంగోలులో చేయించిన స్కానింగ్‌లో మీకు 80 శాతం జబ్బు వున్నది. అంత జబ్బుతో ఎవరూ బ్రతకరు. కాని మీరు బ్రతికే వున్నారు. మా స్కానింగ్ మిషన్లు అన్నీ విదేశాల నుండి వచ్చినవి. చాలా మంచి మిషన్లు. కాని వాటిలో తీసిన రిపోర్టులో మీ శరీరంలో ఏ జబ్బు కనిపించటం లేదు. చాలా ఆశ్చర్యంగా వుంది. అందుకే మిమ్మల్ని నాలుగు గంటల పాటు రకరకాల పరీక్షలు చేశాము. మీ తల వెంట్రుకల నుండి పాదాల వరకు రకరకాల పరీక్షలు చేసినా మీ శరీరంలో ఈ జబ్బేకాదు, ఏ రకమైన జబ్బూ లేదు. మీ కడుపు నిండా నీరు వుంది. అది ఇప్పుడు తీస్తే మళ్ళీ వస్తుంది. రెండు రకాల మాత్రలు వ్రాశాను, 21 రోజులపాటు వాడితే కడుపు మామూలు స్థితికి వస్తుంది' అన్నాడు. '21 రోజుల తర్వాత మరలా ఇక్కడికి రావాలా?' అని అడిగాను. 'నీకు అసలు ఏ జబ్బు లేనప్పుడు మరలా ఎందుకు రావడం. నువ్వు మరలా ఇక్కడికి రావలసిన అవసరం లేదు' అన్నాడు. 'పథ్యం ఏమిటి?' అని అడిగాను. 'నీ ఒంట్లో నెత్తురు లేదు. అందుకని నీకేది ఇష్టమైతే అది తిను కాని ఉప్పు తక్కువగా తీసుకో' అన్నాడు.

ఒంగోలు వచ్చిన తర్వాత డాక్టరుగారు చెప్పినట్లుగానే అన్నీ రకాలైన భోజనాలు, మాంసం, చేపలు ఎక్కువగా తినటం ప్రారంభించాను. డాక్టరుగారు చెప్పినట్లుగానే నా కడుపు సాఫీగా అయ్యింది. ఒక నెల తర్వాత చర్చిలో బుధవారం సాయంకాలం వాక్యం చెప్తూ ఎడమ చేయి మణికట్టు దగ్గర గీరితే రక్తం వచ్చింది. మరుసటి రోజు గవర్నమెంట్ హాస్పిటల్‌కి వెళ్ళి చెప్పాను. మీకు ఏ జబ్బూ లేదు, శరీరంలో రక్తం ఎక్కువ అయింది అన్నాడు డాక్టరు. ఏం చెయ్యమంటారు అని అడిగాను. రక్తదానం చెయ్యమని సలహా ఇచ్చాడు డాక్టరు. నా రక్తం పనికివస్తుందా? నాకు ఐదు నెలల క్రితం పసికర్లు అయ్యాయి అన్నాను. ఆయన నాకు రక్త పరీక్ష చేసి, మీకు అసలు ఎప్పుడూ పసికర్లు రాలేదు, నీకు బి.పి. కానీ, షుగరు కానీ లేవు అన్నాడు. వెంటనే నేను ఒక బాటిల్ రక్తం దానం చేశాను. 6 నెలల తర్వాత మరలా రక్తదానం చేశాను.

ఒక్క సామ్యేలు రాజేంద్ర చనిపోతే దేవునికేమీ కొదువ కాదు. వందమందిని ఒక్కక్షణంలో ఆయన లేపగలడు. కాని నశించిపోతున్న ఒక పాపినైన నా కొరకు ఆయన ప్రణాళికతో అమెరికా నుండి వచ్చిన జానెట్ అనే ఆమెను సాక్షిగా పెట్టి, 2000 సంవత్సరాల క్రితం (మార్కు సువార్త 1వ అధ్యాయం 29వ వచనము ప్రకారం) జరిగిన సంఘటనలోనికి నన్ను తీసుకొని వెళ్ళాల్సిన అవసరం దేవదేవునికి ఏమీ లేదు.

దేవుని ప్రేమ అనేది మానవ మాత్రులకు వివరించ అసాధ్యము. ఎవరికి వారు అనుభవములో మాత్రమే తెలుసుకొనగలిగినది.

# మిమ్మును మోసపరచుకొనవద్దు

**"మీరు వినువారు మాత్రమైయుండి మిమ్మును మీరు మోసపుచ్చుకొనకుండ వాక్యప్రకారము ప్రవర్తించువారునై యుండుడి" (యాకోబు 1:22).**

అనేకమంది క్రైస్తవులు సంఘములో జరిగే ప్రతి ఆరాధనకు, బహిరంగ సభలకు హాజరవు తుంటారు. టి.వి.లో వచ్చే ప్రసంగాలను వింటుంటారు. వాక్యం వినటానికి ఎంతో ఆసక్తి చూపిస్తారు కాని వాక్య ప్రకారం నడుచుకోరు. బైబిలు ప్రతిరోజు చదవరు. ఒకవేళ చదివినా, చదివిన దానిని గురించి ధ్యానం చెయ్యరు. బైబిలు ఎక్కువగా చదవటానికి అమిత మైన బద్ధకం చూపిస్తుంటారు. వాక్యం బోధించే వాళ్ళంతా వాక్యం చెప్పేది అందరి దగ్గర ఉండే బైబిలు నుండే. వినే వాళ్ళ దగ్గర ఉండే బైబిల్లోని సారాంశమే వాళ్ళూ బోధించేది. మరి ప్రజలు బైబిలు చదవడానికి కాకుండా వినడానికే ఎందుకు ఎక్కువ ఆసక్తి చూపిస్తారంటే బైబిలు చదివే తీరిక లేక లేదంటే పరిశీలనాత్మకంగా చదివే ఆసక్తి లేకపోవడం వలన ఇతరులు చెప్పేది విని 'ఆహా, వాక్యము ఎంత బాగా చెప్పారు' అని అభినందిస్తుంటారు. అంటే చర్చిలో, సువార్త సభల్లో, వీడియోల్లో వాక్యము వినేవారు వాళ్ళకి తెలియని వాక్యము వింటుంటారు కాబట్టే అలా అంటారు. అదే వాక్య జ్ఞానం ఉన్నవారైతే ఆ మాట అనరు. కాబట్టి ఎవరికి వారే బైబిల్ ఎక్కువగా చదివి, చదివిన వాక్యాన్ని ధ్యానించాలి. అప్పుడు వాక్యము బోధించేవారు చెప్పేది సరైనదా కాదా అన్నది తెలుస్తుంది. ఎందుకంటే అబద్ధ బోధకులు, ప్రవక్తలు ఈ లోకంలోకి బయలుదేరి ఉన్నారని బైబిలు చెప్తుంది. *'అటువలెనే మీలోను అబద్ధ బోధకులుందురు;... వారు అధిక లోభులై, కల్పనా వాక్యములు చెప్పుచు మీ వలన లాభము సంపాదించుకొందురు' (2పేతురు 2:1,3).* వాక్యమును అబద్ధముగా బోధించేవారి వాక్య ప్రకారము మనం నడిస్తే దారి తప్పిపోతాము. ఎందుకంటే వారు మీ నుండి ధనము ఆశించి వాక్యము బోధిస్తారే తప్ప మీ ఆత్మీయ జీవితం గురించి కానీ, మీ వాక్యపరిజ్ఞానము గురించి కానీ, మీరు దేవునిలో ఎదుగుతున్నారా లేదా అన్న విషయం గురించి పట్టించుకోరు. మరీ ముఖ్యంగా వారు దేవుని మీద కాకుండా అక్షరం మీద ఆధారపడతారు కాబట్టి వారి వాక్యము ఫలించదు. మీరు వాక్య ప్రకారం నడవాలంటే మీరు విన్న వాక్యం సరైనదో కాదో తెలిసి వుండాలి. *"ప్రియులారా, అనేకులైన అబద్ధ ప్రవక్తలు లోకములోనికి బయలు వెళ్ళియున్నారు. గనుక ప్రతి ఆత్మను నమ్మక, ఆయా ఆత్మలు దేవుని సంబంధమైనవో కావో పరీక్షించుడి" (1యోహాను 4:1).* వాక్య పరిజ్ఞానము లేని అనేకమంది, బోధకుల అవతారం ఎత్తి ప్రజలను మోసం చేస్తుంటారు కాబట్టి, వారు దేవుని సంబంధమైన వారో కాదో తెలుసుకోవాల్సిన బాధ్యత మన మీదనే ఉంది. అలాంటి వారిని కనిపెట్టాలంటే మనకు తప్పని సరిగా బైబిలు జ్ఞానము అవసరం. మనం బైబిలును ఎక్కువగా చదివి, దానిని ధ్యానించటం ద్వారా మనకు వాక్యజ్ఞానము ఏర్పడు తుంది. బైబిలు చదవటానికి, దానిని ధ్యానము చేయడానికి మనం సమయం కేటాయించం కాబట్టే వాక్యము తెలియక ఎవరు ఏమి చెప్పినా నమ్మాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. చాలా మందికి బైబిలు అర్థంకాక చదవడానికి ఇష్టపడరు. ఒకవేళ బైబిలును అర్థం చేసుకొనే జ్ఞానం లేకపోతే దేవుడిని అడిగితే అర్థమయ్యేలా చేస్తాడు. *'మీలో ఎవనికైనను జ్ఞానము కొదువగా ఉన్న యెడల అతడు దేవుని అడుగవలెను. అప్పుడది అతనికి అనుగ్రహింపబడును (యాకోబు 1:5).* మీకు బైబిలు జ్ఞానం లేకపోతే ఎవరు ఏది చెప్పినా నమ్మి మిమ్మును మీరే మోసపుచ్చుకొనువారు అవుతారు. కాబట్టి వాక్యము చదివి, ధ్యానించి, వాక్య ప్రకారము నడుచుకుందాము. అందుకు మీరు సిద్ధమా?


**సండేస్కూల్/V.B.S. బుక్స్**

**మరియు గేమ్స్ కొరకు**

**ఫోన్: 9440217726**

# మదర్ తెరీసా

మిషనరీ సిస్టర్‌గా జీవితమంటే కష్టతరమైనదే. ఆమె తన తల్లిని, అక్కను, అన్నను, స్నేహితుల్ని, బంధువుల్ని విడిచి వెళ్ళాలి. ఆమె 16 సం॥లు నిండినప్పుడు రెండు నెలలపాటు ప్రార్థించింది. మరో రెండు సంవత్సరాలు ధ్యానంలో గడిపి తనకు కలిగిన ప్రేరణ నిజమైనదని నిర్ధారించుకుని తన తల్లితో తన నిర్ణయాన్ని చెప్పింది. అప్పుడు తన తల్లి 24 గంటలు తన గదిలోనే ఉంది. బయటకు వచ్చి, 'నా చిట్టితల్లీ, నీ చేతిని దేవుని చేతిలో ఉంచి ఆయనతోనే నీ జీవితాన్ని సాగిస్తూ, క్రీస్తుకు అంకితమవ్వాలని చెప్పింది'. ఆగ్నెస్ అన్న అయిన లాజర్‌కు ఉత్తరం వ్రాసింది. ఆయన ప్రతిఘటిస్తూ జవాబు వ్రాశాడు. నీవు నీ జీవితాన్ని అగాధంలో పడవేసుకుంటావా అని కోపంగా వ్రాశాడు. ఆగ్నెస్ కోపంతో తన అన్నకు జవాబు వ్రాస్తూ, నీవు నీ రాజుకు, రెండు మిలియన్ల ఆల్బేనియా ప్రజలకు సైనికాధికారిగా సేవ చేస్తున్నానని అనుకుంటున్నావు. కాని, నేను సర్వలోకానికి రాజైన యేసుప్రభువు సేవకు వెళతున్నానని వ్రాసింది. ఆ విధమైన జవాబు చదివిన తరువాత లాజర్ తన అభిప్రాయాన్ని మార్చుకున్నాడు.

దేవుని పిలుపు మేరకు మదర్ తెరీసా తన పరిచర్యను మొదలుపెట్టిన విధానాన్ని చూదాం. పాపంతో నిండియున్న ఈ ప్రపంచాన్ని పవిత్రపరచడానికి యేసుప్రభువు మానవునిగా జన్మించి, సాతాను కబంధ హస్తాలలో చిక్కుకొనిపోయిన పాపాత్ములకు విముక్తిని ప్రసాదిస్తూ దైవప్రేమను, క్షమాగుణాన్ని లోకానికి చూపెట్టిన యేసుప్రభువు మాటలు గైకొనుటకు ఆగ్నెస్ నిర్ణయం తీసుకుంది. 'నన్ను వెంబడించగోరువాడు తన్ను తాను ఉపేక్షించుకొని, ప్రతిదినము తన సిలువనెత్తుకొని నన్ను వెంబడించవలెను' (లూకా 9:23).

క్రీస్తు ప్రతినిధిగా, ప్రేమాభరితమైన ఆయన దివ్య రాజ్యాన్ని వివరించే రాయబారిగా, విశ్వప్రేమను చూపించే సేవికగా తన జీవితం పండిపోవాలన్న అచంచలమైన సంకల్పం ఆగ్నెస్‌ను విదేశానికి సిద్ధంచేసింది. 'లొరెటో మఠకన్యల' కేంద్రస్థానం ఐర్లాండ్‌దేశంలోని డబ్లిన్ నగరంలో ఉంది. అక్కడ ఉన్న మదర్ జనరల్‌తో ఇంటర్వ్యూ అయిన తరువాత అక్కడ కొంతకాలం మఠ జీవితానికి సంబంధించిన ప్రాథమిక సూత్రాలు, ఇంగ్లీషు భాష నేర్పి భారతదేశానికి పంపాలని నిర్ణయించారు. సెప్టెంబరు 25, 1928 రాత్రి చర్చిలో ఆమెకై వీడ్కోలు సభ ఏర్పాటు చేయబడింది. మరుసటి రోజు రైల్వేస్టేషన్‌లో సుమారు వందమంది ఆమెకు వీడ్కోలు చెప్పారు. ఆనాటి ప్రయాణంలో తన తల్లి, అక్క తనతో రైలులో ప్రయాణమయ్యారు. తన స్నేహితుల్ని, సంఘములోని వారిని విడిచి వచ్చేటప్పుడు తను బాధతో వారికి వీడ్కోలు చెప్పింది. ఆగ్నెస్ వెళ్లినప్పుడు కాథలిక్ మిషన్స్ అనే పత్రికలో ఇలా వ్రాయబడింది. 'పరిశుద్ధుడైన పేతురు వెంటనే తన వలలను విడిచి ప్రభువును వెంబడించిన రీతిగా ఆగ్నెస్ తన పుస్తకాలను వదలి దేవుని వెంబడించుటకు సిద్ధపడింది. ప్రతి ఒక్కరు ఆశ్చర్యపడ్డారు. ఎందుకంటే క్లాసులో ఆమే ఫస్ట్. అందరి మన్ననలు పొందేది. అందరితో పొగడబడేది. చర్చి బాలికలందరిలో ముందుంటూ పాటలు పాడుటలో ఆమెలేని లోటు తీరనిది మరియు పూడ్చలేనిది. ఆమె వెళ్ళేటప్పుడు ఆమెకు వీడ్కోలు చెప్పటానికి వచ్చిన వారంతా కంటనీరు పెట్టుకున్నారు'. అంత చిన్న వయసులో ఎంత మంచి అభిమానాన్ని సంపాదించుకుంది.

అక్కడ నుండి ఆగ్నెస్ తల్లి, అక్కతో జాగ్రెబ్ అనే పట్టణంలో మూడు వారాలు వుంది. లొరెటో సిస్టర్స్ సంస్థలో చేరటానికి యుగోస్లావియా దేశానికి చెందిన 'బెటికా' అనే మరో అమ్మాయి ఆగ్నెస్‌తో కలవనుంది. వారిద్దరూ ఆస్ట్రియా, స్విట్జర్లాండు గుండా ఫ్రాన్సు దేశానికి వెళ్లి అక్కడ నుండి లండన్ చేరుకుని ఐర్లాండు దేశములోని డబ్లిన్ వరకు ఓడలో ప్రయాణమయ్యారు. ఆగ్నెస్ తన తల్లికి, అక్కకు వీడ్కోలు చెప్పింది. ఆనాడు విడిపోయిన ఆమె తల్లి, అక్కలను వారి

జీవితకాలములో చూచుకొనే అవకాశం ఉండదని వారికా రోజు తెలియదు. ఆగ్నెస్ తల్లి 1972లోను, అక్క 1974 లోను చనిపోయారు. వారు ఉత్తరాల్లో ప్రస్తావిస్తూ ఆగ్నెస్ తల్లి ఈ లోకంలో జీవించగా చూసుకోకపోయినా యేసు ప్రభువు సమక్షంలో కలుసుకుని ఆనందిస్తామనే నిరీక్షణ కలిగియున్నట్లు వ్రాసేవారు. 1910లో ఆగ్నెస్ పుట్టిన దగ్గ ర్నుండి ఆమె తల్లి ఆమెను నడిపించి ముందుకు తీసుకుని వచ్చింది. కాని ఇప్పుడు ఆగ్నెస్ తనంతట తానుగా జీవించాలి.

ఆగ్నెస్, బెటికా డబ్లిన్ నగరం చేరగానే మదర్ సుపీరి యర్, మరిద్దరు లొరెటో సిస్టర్స్ వారిని కలుసుకున్నారు. మదర్ సుపీరియర్ ఇంటర్వ్యూ అయిన తరువాత వారి శిక్షణ మొదలైంది. ఇండియాలో ఉండి వచ్చిన మదర్ యం. బోర్గియా ఇర్విన్ ఇంగ్లీషు బోధించుటకు నియమించబడ్డారు. ఒకరోజు మదర్ ఇర్విన్ ఆగ్నెస్ విషయంలో ఈ క్రింది విధంగా ఆలోచిస్తుంటే ఆగ్నెస్ గమనించింది. ఈ గోన్‌షా బొయావు ఆగ్నెస్ ఇంత చిన్నగా పీలగా వుంది. ఈమె కష్టపడి పని చేయగలదా? ఈమె తన అభిప్రాయాన్ని అలాగే పట్టుకుని ఉంటుందా? కక్షపెట్టుకోకుండా ఉండగలదా? గట్టిగా నిలబడగలదా? ఈమె తప్పుల్ని పెద్దగా చేస్తుందా? లేక వాటిని తేలిగ్గా విసరి పారేయగలదా? అందరితో కలసి మెలసి వుండగలదా? అందరితో ఆనందంగా గడపగలదా? ఇప్పుడే మొదలైంది, ఇంకా చాలా దూరం వెళ్ళాలని, ముందు ముందు ఎంతో నేర్చుకోవాలిగదా అనుకుంది. ఆమె పై విధంగా అనుకున్నవన్నీ ఆగ్నెస్ పసికట్టింది. దేవునికి కృతజ్ఞతా స్తుతులు చెల్లించి అదే ప్రార్థన ఇంగ్లీషులో చేయడానికి ప్రయత్నించింది.

ఎంతో విశ్వాసంతో ప్రార్థన చేశారో –ఆగ్నెస్, బెటికాలు ఇండియాకు వెళుతున్నారు. నవంబరు 1929 రెండవ వారంలో వారి ప్రయాణం ఓడలో ప్రారంభమైంది. సముద్ర ప్రయాణం చాలా కష్టతరమైనది. ఆరు వారాలకు శ్రీలంక దేశంలోని కొలంబో నగరానికి చేరుకున్నారు. అక్కడ నుండి మద్రాసు నగరానికి వచ్చారు. ఇండియా దేశంలో వారు కాలుమోపారు. ఎక్కడ చూసినా పేదరికం. ఆగ్నెస్ తన జీవితంలో ఎన్నడూ ఊహించని పేదరికాన్ని చూసింది. జనవరి 6, 1929న వారు కలకత్తా నగరానికి చేరారు. ఆగ్నెస్ తను అనుకున్న బెంగాల్ ప్రావిన్స్‌కు చేరుకుంది. లొరెటో సిస్టర్స్ వారిని కలకత్తాలోని లొరిటో కాన్వెంట్‌కు తీసుకొచ్చారు. వారక్కడ చర్చికి వెళ్లి సురక్షితమైన ప్రయాణం దయచేసినందుకు యేసుప్రభువుకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించారు. వారక్కడ వారం రోజులుండి డార్జిలింగ్‌కు బయలుదేరారు. క్రిక్కిరిసి అల్లరిగా వున్న రైలు మూడవ తరగతి పెట్టెలో ప్రయాణిస్తున్నారు. రైల్లో కొందరు వీరిని చూసి మీరు ఎక్కడ నుండి వచ్చారు? ఎక్కడకు వెళ్తున్నారు? మీరు వేసుకున్న బట్టలు చాలా బాగున్నాయి అని సంభాషి స్తుంటే ఆగ్నెస్‌కు యెహాను సువార్తలోని 1:47 వాక్యం గుర్తుకు వచ్చింది. యేసుప్రభువు నతనియేలు తన వద్దకు వచ్చుట చూచి ఇదిగో యితడు నిజముగా ఇశ్రాయేలీయుడు, ఇతనియందు ఏ కపటమును లేదని అతని గూర్చి చెప్పెను. అదేవిధంగా ఆగ్నెస్ తనతో ఎంతో కుతూహలంగా ప్రయాణి స్తున్న భారతీయులను చూసి అనుకుంది, వారియందు ఏ కపటం లేదని. ఎంతటి సంతోషం. ఎంతగొప్ప భాగ్యమును ప్రసాదించిన దేవునికి వందనాలు అనుకుంది. ఇండియాకు కలకత్తా రాజధానిగా 1912 వరకు ఉన్నప్పుడు, డార్జిలింగ్ వేసవి రాజధానిగా వుండేది. అందువల్లనే డార్జిలింగ్‌లో ఎన్నో యూరోపియన్ కట్టడాలున్నాయి. ఢిల్లీ రాజధాని అయిన తరువాత బ్రిటీషువారు సిమ్లాను వేసవి రాజధానిగా చేసుకున్నారు.

క్రొత్తగా చేరిన సిస్టర్స్ మతపరమైన రోజు వారి జీవిత మును గురించి నేర్చుకున్నారు. వారికి లేఖనాలు గురించి, ప్రార్థన గురించి లొరెటో సంస్థ గురించి, ఆ సంస్థలోని కొందరు సెయింట్స్ జీవితాలు గురించి బోధించారు. 1609లో మేరివార్డ్ అనే ఇంగ్లీషు యువతి జసూట్ ఫాదర్స్ సంస్థ ది సొసైటీ ఆఫ్ జీసస్ రూల్స్ ప్రకారం తన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ది బ్లెస్డ్ వర్జిన్ మేరి అనే సంస్థను స్థాపించారు.

**(సశేషం)**

# తల్లిదండ్రులారా!

పాతనిబంధనలో యెహోవా దేవుడు కానీ, క్రొత్త నిబంధనలో యేసుప్రభువు కానీ, చిన్నబిడ్డల విషయంలో ఎంతో భారము కలిగియున్నట్లు చూడగలము. *"వారు ఆ దేశము మీద బ్రదుకు దినములన్నియు నాకు భయపడ నేర్చుకొని,* ***తమ పిల్లలకు నేర్పునట్లు..."*** *(ద్వితీయో. 4:10), "నేడు నేను నీకాజ్ఞాపించు ఈ మాటలు నీ హృదయములో ఉండవలెను.* ***నీవు నీ కుమారులకు వాటిని అభ్యసింపజేసి...,*** *(ద్వితీయో. 6:6,7)* అని, *"యెహోవా స్తోత్రార్హ క్రియలను ఆయన బలమును ఆయన చేసిన ఆశ్చర్యకార్యములను దాచకుండ వాటిని వారి* ***పిల్లలకు మేము చెప్పెదము.*** *రాగల తరములలో* ***పుట్టబోవు పిల్లలు దాని నెరుగునట్లును వారు లేచి తమ పిల్లలకు దానిని వివరించునట్లును..."*** *(కీర్తనలు 78:4,5)* అని వ్రాయబడిన ప్రకారము చిన్నబిడ్డల పట్ల దేవుడైన యెహోవా ఎంతో బాధ్యత కలిగియున్నట్లు గమనించగలం. అలాగే యేసుప్రభువు కూడా తాను సిలువ మరణము పొందటానికి ముందు స్త్రీలను ఉద్దేశించి *"యెరూషలేము కుమార్తెలారా, నా నిమిత్తము ఏడ్వకుడి; మీ నిమిత్తమును* ***మీ పిల్లల నిమిత్తమును*** *ఏడ్వుడి. (లూకా 23:28)* అని చెప్పాడు. దేవుడైన యెహోవా కానీ, యేసు ప్రభువు కానీ చిన్నబిడ్డల పట్ల కలిగియున్న ఆసక్తినిబట్టి సాతాను చిన్నబిడ్డలను దేవునికి దూరం చేయటానికి తల్లిదండ్రులను లక్ష్యము చేసుకొని వారిని ఇబ్బందులకు గురిచేయడం ద్వారా, ఈ లోకభాగాలకు అలవాటు చేసి, ధన సంపాదనలో నిమగ్నమయ్యేలా చేయడం ద్వారా, వారు బిడ్డలను దేవునిలో పెంచేందుకు ఆటంకం కలిగిస్తుంది. బిడ్డలకు మంచి భవిష్యత్తుని ఇవ్వాలనే క్రమంలో వారికి మంచి చదువు చెప్పించటం, వారికి ఆస్తిపాస్తులు సమకూర్చడం మీదనే దృష్టి పెడతారు తప్ప, వారి ఆధ్యాత్మిక స్థితిని గురించి పట్టించుకోరు. తల్లిదండ్రులు బిడ్డల ప్రవర్తన విషయంలో మానసికమైన వేదనకు గురవుతుంటే, అది కేవలం వారి స్వయంకృతాపరాధమే. ఎంత సంపాదించినా, ఎంత గొప్పగా బ్రతికినా కన్నబిడ్డలు దూరమైపోతే ఎంత వేదనగా ఉంటుందో అనుభవించే వారికే తెలుస్తుంది. బిడ్డలకు పెద్ద పెద్ద చదువులు చదివించాలంటే లక్షలు ఖర్చు పెట్టాలి కానీ, దేవుని గురించి చెప్పడానికి ఏం ఖర్చు అవుతుంది? కేవలం సమయమే కదా వెచ్చించాలి. బిడ్డలను నిజంగా ప్రేమించే తల్లిదండ్రులు బిడ్డలకోసం ఆ మాత్రం సమయం కేటాయించలేరా? దేవునిలో ఎదిగే బిడ్డలు ఈ లోకానుసారంగా జీవించరు కదా! అప్పుడు చదువులో టాప్ ర్యాంక్ ఎందుకు రాదు? బిడ్డలను దేవునిలో పెంచాలన్న మీ ఆసక్తి చూచి, బిడ్డలను క్రమశిక్షణలో ఉంచే బాధ్యత దేవుడు తీసుకోడా? అంతేకాక, దేవుని కాపుదల, భద్రత మీ బిడ్డలకు ఉండదా? *"యెహోవాయందు భయభక్తులు గలవారి చుట్టు ఆయనదూత కావలియుండి వారిని రక్షించును" (కీర్తనలు 34:7).* బిడ్డలను దేవునిలో పెంచేటప్పుడు, మీరు ఎంతో ధైర్యంగా ఉండొచ్చు. బిడ్డలను దేవునిలో పెంచడమంటే, ఇంట్లో కుటుంబ ప్రార్థన పెట్టుకోవడం, బిడ్డలతో క్రమం తప్పకుండా బైబిలు చదివించడం, ప్రార్థన చేయించడం, బైబిల్లో విషయాలను వారికి చెప్పడం, ఇంతేకదా. వారి భవిష్యత్ కోసం సమయం కేటాయించలేరా? ఇలా చేయడానికి మీ జేబులో ఒక్క పైసా అయినా ఖర్చు కాదు కదా? తల్లిదండ్రులారా, ఆలోచించండి. మీరు దేవునిలో లేకపోయినా సరే, కనీసం మీ బిడ్డలను దేవునిలో పెంచండి.

బైబిలులో అనేకమంది యౌవనస్తులు దేవుని కోసం ప్రాణాలు ఇవ్వడానికి సిద్ధపడినవారు, పాపమునకు దూరంగా ఉన్నవారు ఉన్నారు. యౌవనస్తుడైన యెహోషువకు ఇశ్రాయేలీయులను నడిపించే బాధ్యతను దేవుడు అప్పగించాడు. షద్రకు, మేషాకు, అబేద్నెగో మరియు దానియేలు దేవుని కోసం ప్రాణాలు ఇవ్వడానికి సిద్ధపడ్డారు. యోసేపు పాపమునకు దూరంగా పారిపోయాడు. వీరంతా చిన్నప్పటి నుండి దేవునిలో ఎదిగినవారు కాబట్టి పెద్దవారైనప్పుడు కూడా దేవునిలో స్థిరంగా నిలబడగలిగారు. చిన్నప్పటి నుండి వాక్యమనే పునాది మీద వారి జీవితాలు కట్ట

బడ్డాయి. అందుకే ఎలాంటి పరిస్థితులు కూడా వారిని కలిదించలేకపోయాయి. అందుకు కారణం, వారి కుటుంబమే. తల్లిదండ్రులు వారిని దేవునిలో పెంచబట్టే వారు వారి ప్రాణాలను ఫణంగా పెట్టగలిగేటంత విశ్వాసంలో ఎదిగారు. బిడ్డలను దేవునిలో పెంచకపోతే వారి జీవితం ఇసుక మీద కట్టబడే ఇల్లులా ఉంటుంది. *"కాబట్టి యీ నా మాటలు విని వాటిచొప్పున చేయు ప్రతివాడును బండమీద తన యిల్లు కట్టుకొనిన బుద్ధిమంతుని పోలియుండును. వాన కురిసెను, వరదలు వచ్చెను, గాలి విసిరి ఆ యింటిమీద కొట్టెను గాని దాని పునాది బండమీద వేయబడెను గనుక అది పడలేదు. మరియు యీ నా మాటలు విని వాటి చొప్పున చేయని ప్రతివాడు* ఇసుక *మీద తన యిల్లు కట్టుకొనిన బుద్ధిహీనుని పోలియుండును. వాన కురిసెను, వరదలు వచ్చెను, గాలి విసిరి ఆ యింటిమీద కొట్టెను, అప్పుడది కూలబడెను" (మత్తయి 7:24-27).* బిడ్డలకు ఊహ తెలిసినప్పటి నుండి **"దేవుడు"** అన్న పదాన్ని పరిచయం చేస్తే వారి జీవితాలు బండమీద కట్టబడిన ఇంటివలె స్థిరంగా ఉంటాయి. పిల్లలకి సంగ్రహశక్తి ఎక్కువగా ఉంటుంది. ఏదైనా సరే వాళ్ళు త్వరగా నేర్చుకోగలరు. వాళ్ళకి నేర్పడానికి మనమేం పెద్దగా కష్టపడాల్సిన పని లేదు. వారికి అలవాటు చేయడంలోనే మన నేర్పరితనాన్ని చూపించాలి. పిల్లలకి రెండు మూడు సంవత్సరాల మధ్యలో పళ్ళు వస్తాయి. అప్పుడు తల్లి వారి పళ్ళను తన వేలితో రుద్ది శుభ్రం చేస్తుంది. తరువాత బిడ్డ వేలితో పళ్ళు రుద్దుకోవడం నేర్పిస్తుంది. తరువాత పళ్ళు రుద్దుకోమని రోజూ గుర్తు చేస్తుంది. ఆ తరువాత వారికి అలవాటై వాళ్ళే ప్రతిరోజూ మర్చిపోకుండా పళ్ళు తోముకుంటారు. తిన్నా, తినకపోయినా పళ్ళు తోముకోవడం మర్చిపోరు. వాళ్ళు ముసలివాళ్ళు అయ్యి, పళ్ళన్ని ఊడిపోయినా సరే, అలవాటు ప్రకారం నోటిలో నీళ్ళు పోసుకొని పుక్కిలించి ఊసేస్తారు. ఇలాగే బైబిల్ చదవడం, ప్రార్థన చేసుకోవడం అనేది ఊహ తెలిసినప్పటి నుండి నేర్పిస్తే, వారికి అలవాటు చేస్తే, వారు నేర్చుకోరా? అలవాటు అవ్వదా? కూలి పని చేసుకొనే తల్లిదండ్రులు, వారు పడే కష్టం వారి బిడ్డలు పడకూడదని కోరుకుంటారు. అందుకే ఎంత కష్టపడైనా వారి బిడ్డలని చదివించి వారిని ప్రయోజకులని చేయాలనుకుంటారు. మరి దేవునికి దూరమై, కష్టాలు, బాధలు అనుభవించే తల్లిదండ్రులు, తమ బిడ్డలు వారిలా ఈ లోకానుసారంగా జీవించకూడదని ఎందుకు కోరుకోరు? బిడ్డల ఆధ్యాత్మిక స్థితి మీద ఎందుకు దృష్టి పెట్టరు? తల్లిదండ్రులు ఈ లోకానుసారమైన జీవితం జీవిస్తుంటే, బిడ్డలు కూడా వారి వెంటే నడుస్తారు. ముందుగా తల్లిదండ్రులు బిడ్డల కోసం వారి ఆధ్యాత్మిక జీవితాన్ని సరిచేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. తల్లిదండ్రులు విశ్వాసులుగా ఉండి, బిడ్డలను విశ్వాసంలో ఎదిగేలా చేయాలి. **ఇది దేవుని చిత్తమై ఉంది.**

**(సశేషం)**


## ఇంటర్నెట్‌లో తెలుగు బైబిల్

**మీరు ఎక్కడున్నా సరే, మీ స్మార్ట్ ఫోన్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్‌లలో తెలుగు బైబిల్ చూడవచ్చును. అంతేకాక తెలుగు-ఇంగ్లీషు ప్యారలల్ బైబిల్, తెలుగు ఆడియో బైబిల్, తెలుగు బైబిల్ ఎన్‌సైక్లోపీడియా, తెలుగు ఆడియో, వీడియో పాటలు, తెలుగు పాటల రచనలు, అద్భుత సాక్ష్యములు, బైబిల్ వాల్‌పేపర్స్, తెలుగు క్రైస్తవ పుస్తకములు ఇంకా మరెన్నో మీ కోసం... నేడే దర్శించండి...**

**www.onlinetelugubible.net**

# నీతిగా ఎంచబడునది

'హన్నాకృప' పాఠకులకు, మన ప్రభువైన యేసుక్రీస్తు నామమున మీకందరికి నా శుభములు.

**"అబ్రాహాము దేవుని నమ్మెను, అది అతనికి నీతిగా ఎంచబడెను" (రోమా 4:3).**

ఈ లోకంలో చాలామంది ఎలాంటి పాపాలు చేయకుండా ఉండేవాళ్ళు ఉంటారు. అంటే అబద్ధమాడకుండా, దొంగతనం చేయకుండా, వ్యభిచారం చేయకుండా చాలా పవిత్రంగా ఉండేవాళ్ళు ఎక్కడో ఒకచోట మనకి కనబడుతుంటారు. చాలామంది దేవుని నమ్మని వారు కూడా ఎంతో నీతిగా జీవిస్తుంటారు. అయినప్పటికీ వాళ్ళు నీతిమంతులుగా తీర్చబడరు. మత్తయి 19:16-22 చూచినట్లయితే ఒక యౌవనస్థుడైన ధనవంతుడు తను ధర్మశాస్త్ర ఆజ్ఞలన్నిటినీ గైకొనినప్పటికీ అతను నీతిమంతునిగా తీర్చబడలేదు. ఎందుకంటే అతడు దేవుని నమ్మక తన ధనమును ప్రేమించువాడు. అతను చాలా ధనము కూర్చుకున్నాడు కాబట్టి దొంగతనం చేయాల్సిన అవసరం, అబద్ధమాడటం, మోసం చేయాల్సిన అవసరం రాక పోవచ్చు. అంతమాత్రం చేత అతను నీతిమంతుడుగా తీర్చబడడు. ఎందుకంటే అతని నీతి ధనమును ఆధారము చేసికొని ఉన్నదే తప్ప దేవున్ని ఆధారము చేసికొని లేదు. అతడు యేసును వెంబడించడానికి తన ధనము వదులుకోవాల్సి వచ్చినప్పుడు కాని అతని నీతి ఏంటో బయట పడలేదు. అతడు ఎంత నీతిగా జీవించినప్పటికీ అతని మనసులో దేవునికి చోటియ్యలేదు. ఒకవేళ అతను దేవున్ని ప్రేమించినట్లయితే అంత ధనము కూర్చుకోడు. అతడు ధనమును ప్రేమిస్తున్నందువల్ల యేసుని వెంబడించలేక పోయాడు. అతడు ధర్మశాస్త్రములోని అన్ని ఆజ్ఞలనైతే పాటించాడు కానీ, దేవుడు ప్రత్యేకంగా చెప్పిన 'నిన్నువలె నీ పొరుగువానిని ప్రేమింపవలెను' అనే ఆజ్ఞను పాటించలేదు. నేటి దినములలో అనేకమంది క్రైస్తవులుగా పిలువబడుతున్న వారు ఈ ధనవంతుని పోలిన జీవితం జీవిస్తుంటారు. కేవలం మనుష్యుల ముందు తమ నీతి బహిర్గతం చేసుకోవడానికి ప్రతి కార్యము చేస్తారు. ఇలాంటి వారు దేవుడు ఉన్నాడని నమ్మరు. దేవుని మీద ఆధారపడకుండా ఈ లోకానుసారంగా జీవిస్తూ, ధనమును ప్రేమిస్తూ, ఆస్తులు కూడబెట్టుకుంటూ దైవ కార్యక్రమాల్లో పాల్గొనటం ద్వారా తాము నీతిమంతులుగా గుర్తింపబడాలని కోరుకుంటారు. ఇతరుల ముందు గొప్పగా కనబడటం కోసం తాము దేవునికి ఇచ్చే చందాలు అందరికీ కనబడేలా, వినబడేలా ఉండాలని కోరుకుంటారు. వీరంతా పైకి విశ్వాసులు అని పిలువబడతారేగాని వారి క్రియలు అవిశ్వాసుల కంటే ఘోరంగా ఉంటాయి. పైకి భక్తిగలవారివలె ఉండి దాని శక్తిని ఆశ్రయించని వారుగా ఉంటారు. *"కాగా ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలు లేకుండ విశ్వాసము వలననే మనుష్యులు నీతిమంతులుగా తీర్చబడుచున్నారని యెంచు చున్నాము"* అని రోమా 3:28లో వ్రాయబడిన ప్రకారం, కేవలం మన నీతి కార్యముల వలన కాక ప్రభువైన యేసు నందు విశ్వాసముంచుట ద్వారా నీతిమంతులుగా తీర్చబడ తాము. నీతిగా జీవించటమనేది దేవుని నమ్ముట ద్వారా కలగాలే తప్ప, మనుష్యుల యొక్క మెప్పు పొందుటకు నీతిగా ఉండటమనేది దేవుని దృష్టిలో సరైనది కాదు. దేవున్ని నమ్మక ముందు అబ్రాహాము నీతిగా జీవించి వుండవచ్చును గాని, దేవుని నమ్మిన తర్వాతనే నీతిమంతునిగా తీర్చబడ్డాడు. *"అబ్రాహాము క్రియల మూలముగా నీతిమంతుడని తీర్చబడిన యెడల అతనికి అతిశయ కారణము కలుగును గాని అది దేవుని యెదుట కలుగదు" (రోమా 4:2).* కాబట్టి మనం దేవుని నమ్ముట ద్వారా నీతిమంతులుగా జీవిద్దాము.

**-ఇట్లు డా॥ సుష్మ ప్రశాంత్, నెల్లూరు**

## గమనిక

క్రైస్తవ కథలు, సాక్ష్యాలు, వ్యాసాలు, రచనలు, కవితలు, పాటలు మొదలగునవి మా ప్రియ పాఠకుల నుండి కోరడమైనది. ఆసక్తి గలవారు తమ తమ భావాలను మా పత్రిక ద్వారా పాఠకులకు అందించవచ్చు. క్రైస్తవ కథ ఏదైనా 2 పేజీలకు మించకూడదు.

స్త్రీల విభాగం

# నా కుటుంబము



**భార్య, భర్త, పిల్లలు కలిసి ఒకే చోట ఉంటే దానిని కుటుంబము అంటారు. పిల్లలు ఉన్నా లేకపోయినా భార్యా భర్తలు కలిసి జీవిస్తున్నా కుటుంబమనే అంటారు. కుటుంబ వ్యవస్థ అనేది దేవుని ప్రణాళికలో భాగమే. కుటుంబ వ్యవస్థలో స్త్రీ ప్రధాన భూమిక పోషిస్తుంది.**

---

మనం జీవిస్తున్న సంఘంలో కుటుంబం యొక్క గౌరవం ఆ ఇంటి తండ్రిపైనే ఆధారపడి ఉంటుంది. భార్య అయినా బిడ్డలైనా సంఘములోను ఇంటిలోను తండ్రి యొక్క నడవడినిబట్టి అతనికి లోబడి ఉంటారు. తండ్రి కోపిష్ఠి అని, లోబడేవారు అతనివలె కోపిష్ఠులైపోతారు. అందుకనే పౌలు తిమోతికి ఇలా వ్రాశాడు "ఇంటి యజమాని సంఘమునకు వెలుపటి వారిచేత మంచి సాక్ష్యము పొందిన వాడై ఉండవలెను. సంపూర్ణమాన్యత కలిగి తన పిల్లలను స్వాధీనపరచుకొనుచు తన ఇంటివారిని బాగుగా ఏలువాడై యుండవలెను.

మోషే ఇశ్రాయేలీయులతో ఆఖరుసారిగా మాట్లాడి నంతసేపు కుటుంబమును గూర్చి మాట్లాడాడు. నువ్వు నివశించే ఇల్లు ఎలా ఉండాలి? నీ ఇంటి ద్వారబంధముల మీదను నీ గవునుల మీదను దేవుని వాక్యమును వ్రాయ వలెను. కుటుంబంలోని నీ కుమారులకు వాటిని అభ్యసింప చేయాలి. అంటే ప్రాక్టీసు చేయించాలి. కుటుంబము లోని పిల్లలు ఒకరికొకరు ప్రేమించుకోవటం, సహాయపడడం తర్ఫీదును తల్లిదండ్రుల ద్వారా ప్రాక్టీస్ చెయ్యాలి. ఇంట్లో కూర్చున్నప్పుడు, త్రోవలో నడిచేటప్పుడు, పండుకొను నప్పుడు, లేచునప్పుడు వాటిని గూర్చి (దేవుని గూర్చి) మాటలాడవలెను. ఇలా ప్రతి కుటుంబము నడుచుకోవాలి.

ఇవి అలంకరణ కొరకు వ్రాయబడినవి కావు. వీటిని తప్పక ఆచరించాలి. ఆచరించకపోతే, రేపు నీ పిల్లలే నీకు శత్రువులు. రేపు వారు నరకములో ఉండటానికి తల్లిదండ్రులే బాధ్యులు. రాజైన దావీదు దేవుని వాక్యము చదవటం మర్చిపోయాడు. కనుక మందసమును క్రొత్త బండి మీద ఎక్కించి ఉజ్జా మరణమునకు కారకుడయ్యాడు.

తన బిడ్డలతో ఎన్నడూ దేవుని వాక్యమును గూర్చి మాట్లాడనందు వలన తన కుమారు లందరూ పాపములోను మరణములోను నడిపించబడ్డారు. ఊరియా కుటుంబాన్ని భగ్న మొనర్చిన దావీదుతో "నీ యింటి వారి మూలముననే నేను నీకు అపాయము పుట్టింతును" అన్నాడు ప్రభువు.

మన కుటుంబము వలన ప్రక్కింటి వాళ్ళకి కీడు తటస్థిస్తే మన కుటుంబము నుండే మనకు కీడు ప్రారంభమవుతుంది.

బైబిలు గ్రంథమంతా దేవుని నీతిని దేవుని తీర్పులను గురించి మాట్లాడుతున్నది. అంతా సైన్సు ప్రకారం కట్టడల ప్రకారం నడుస్తుంది. ఆదాము వద్ద నుండి నా వరకు అది మార్చబడలేదు. "ఒకడు తన ఒడిలో (ప్రక్కింటి) అగ్ని నుంచుకొనిన యెడల వాని వస్త్రము కాలకుండునా? ఒకడు (పరుని) నిప్పుల మీద నడచిన యెడల వాని పాదములు కమల కుండునా?" అని సామెతలు 6:38 వ్రాయబడింది.


"నక్షత్రముల సంఖ్యను ఆయన నియమించి యున్నాడు. వాటికన్నిటికి పేరులు పెట్టుచున్నాడు". మానవ మేధస్సుకు అందని నక్షత్రముల సంఖ్య ఎంత? వాటికి ఒక్కొక్క దానికి ఒక్కొక్క పేరు పెట్టిన దేవుని శక్తి ముందు నేటి మానవుల సంఖ్య చాలా స్వల్పము. నేటి మానవ కుటుంబాల సంఖ్య ఇంకా తక్కువ. అటువంటప్పుడు నేడున్న ప్రతి కుటుంబానికి ప్రత్యేక ప్రణాళికలు ఏర్పరచియున్నాడు.

నాకు తెలిసిన ఒక దైవజనునికి 12 మంది సంతానం. నామకార్థ క్రైస్తవునిగా ఉన్నప్పుడు ఆ దంపతులు తమ పెద్ద కుమారుని మాత్రమే దేవుని సేవకు సమర్పించు కున్నారు. కాని వారు ప్రభువు సేవ చెయ్యటం ప్రారంభించిన తర్వాత వారి పన్నెండుమంది పిల్లలను దేవుని సేవకే సమర్పించారు. **(సశేషం)**

# ఈ నెల ప్రశ్న - జూలై-2025

**అహరోను పినతండ్రి పేరు ఏమిటి?**

(లేవీయకాండము)




మీ జవాబు (రెఫరెన్సుతో సహా) ఈ నెల 15వ తేదీలోపు 9440217726 నంబరుకి వాట్సాప్ ద్వారా మాత్రమే పంపించాలి. సరైన సమాధానం పంపిన వారిలో **'లక్కిడిప్'** ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి రూ.250/-లు విలువ చేసే **'అపొస్తలుడు'** అనే పుస్తకం బహుమతిగా ఇవ్వబడుతుంది. అయితే ఈ అవకాశం కేవలం **'చందాదారులకు మాత్రమే'**. అనగా చందా చెల్లించిన వారు (చందాదారుల పట్టికలో పేరు ఉన్నవారు) ఈ ప్రశ్నకు జవాబు పంపించాలి. 15వ తేది లోపు చందా చెల్లించేవారు కూడా పాల్గొనవచ్చును. ఈ క్రింది బాక్సులో జవాబు, మీ పేరు, బుక్ సీరియల్ నంబరు వేసి ఫోటో తీసి వాట్సాప్ ద్వారా పంపించాలి. పేరు, సీరియల్ నంబరు లేకపోతే వారి పేరు లక్కిడిప్‌లో చేర్చబడదు.

జవాబు.........................................................

పేరు............................................................

గ్రామము...............బుక్ సీరియల్ నంబరు...........

**జూన్-2025 ప్రశ్న జవాబు :**
**430 సంవత్సరములు (నిర్గమకాండము 12:40)**

**జవాబులు పంపినవారు :**

1. బి. సరోజిని-గుంతకల్లు
2. మేరి పవిత్ర (కె.కమల్)-మంచిర్యాల
3. క్రిస్టియానమ్మ-నందికొట్కూరు

## చందాదారుల వివరములు

| | | |
|---|---|---|
| డా॥ బి. ప్రజ్వలిత్ రూబేన్, హన్మకొండ | (12-10-24) | 5000 |
| రెవ.డా॥ వి. విజయకుమార్, బొబ్బిలి | (15-01-24) | 5000 |
| మేరిసలోమి, సిరివెళ్ళ, కర్నూలుజిల్లా | (29-11-22) | 5000 |
| రావెల ప్రసాదరావు, గుంతకల్లు | (21-06-24) | 5000 |
| కె. రజిని, నరసరావుపేట | (15-06-25) | 3000 |
| డా॥ క్రిస్టియన్ సిరప్ప, అనంతపూర్ | (06-07-24) | 3000 |
| యు. అనిత, సిరివెళ్ళ | (06-12-24) | 3000 |
| వై. సంధ్యారాణి, ఒంగోలు | (04-01-25) | 2000 |
| పి.వి.కెరోలిన్, గుంటూరు | (11-12-24) | 2000 |
| డా॥ సిహెచ్‌కె. సుష్మప్రశాంత్, నెల్లూరు | (22-01-24) | 1500 |
| జయ, గుంటూరు | (06-03-24) | 1500 |
| రావెల ప్రసాదరావు, గుంతకల్లు | (27-03-25) | 1000 |
| జి.మాణిక్యమ్మ అనంతపురం | (25-03-24) | 1000 |
| గంధం డేవిడ్ నీలకాంత్ (నెల్లూరు) | | 1000 |
| శ్రీమతి రూతు హోసన్న, కావలి | (09-11-24) | 1000 |
| జి. కమలాకర్, ఒంగోలు | (03-03-25) | 1000 |
| జి. జార్జిథామస్, దుగ్గిరాల | (12-03-25) | 500 |
| కె. ప్రకాశరావు, నరసరావుపేట | (14-01-25) | 500 |
| బి. నెహెమ్యా, చిన్నగంజాం | (25-12-24) | 500 |
| డి. నాగేశ్వరరావు, సంతరావూరు | (10-11-24) | 500 |
| కె. కమల్, మంచిర్యాల, తెలంగాణ | (14-10-24) | 500 |
| యం. విల్సన్, నెల్లూరు | (14-09-24) | 500 |
| కె. ఆదిలక్ష్మి, డిస్ట్రిక్ట్ లైబ్రరి, ఒంగోలు | (24-09-24) | 500 |
| కె. ఐజక్‌సుకుమార్, ఒంగోలు | (14-08-24) | 500 |
| ఆర్. దేవికుమారి, పర్చూరు | (20-05-24) | 500 |
| డి. శ్యామ్‌సిన్హా, బాపట్ల | (13-12-23) | 500 |
| బి. పరంజ్యోతి, హైదరాబాద్ | (11-12-23) | 500 |
| మారనాత బైబిల్ సెమినరీ, విజయవాడ | (24-11-23) | 500 |
| కె. నైటింగేల్, నెల్లూరు | (11-11-23) | 500 |
| బి. సరోజిని, గుంతకల్లు | (06-05-25) | 400 |
| స్వయంప్రభ, చిలకలూరిపేట | (14-06-25) | 350 |
| యస్. రాజశేఖర్, కర్నూలు | (04-06-25) | 350 |
| జి. దేవదాసు, నంద్యాల | (05-04-25) | 350 |
| జి. కళావతి జాకబ్, ఒంగోలు | (03-04-25) | 350 |
| ఆర్.ఆర్.కె.పీటర్-విశాఖపట్నం | (23-03-25) | 350 |
| పి. జాన్‌బాబు-గోపాలపురం | (21-03-25) | 350 |
| ఎ. ప్రభుచరణ్-జగిత్యాల | (19-03-25) | 350 |
| పి. నీలిమారాజారత్నం, ఉయ్యూరు | (14-03-25) | 350 |
| యస్. గోపి, పార్వతిపురం | (17-12-24) | 350 |
| బి. రవికుమార్, హైదరాబాద్ | (20-11-24) | 350 |
| బి. జయరావు, బుచ్చిరెడ్డిపాలెం | (06-11-24) | 500 |
| కె. రాబర్ట్ ప్రభాకర్, ఉదయగిరి | (03-10-24) | 350 |
| వై. జోసఫ్, భీమవరం | (04-10-24) | 350 |
| జి. క్యాథరిన్, ఒంగోలు | (08-10-24) | 350 |
| వి. రత్నమ్మ, హైదరాబాద్ | (17-10-24) | 350 |
| టి. క్రిస్టియానమ్మ, నందికొట్కూరు | (12-09-24) | 350 |
| కె. ఉదయకుమారి, కాకుమాను | (02-08-24) | 350 |
| జె. రాజేష్, ఒంగోలు | (06-07-24) | 350 |
| సిహెచ్. శైలజ, విజయవాడ | (04-04-25) | 200 |

**చిన్నపిల్లల పేజి**

# కారు చీకటిలో కాంతిరేఖ

18వ శతాబ్దంలో వ్యాపారం, రవాణా సముద్రంపై ఎక్కువగా జరిగేవి. కాబట్టి చీకటికారణంగా సముద్రంలో జరిగే ప్రమాదాలను తగ్గించడానికి, ప్రమాదంలో చిక్కుకున్న ప్రయాణికులకు సముద్రతీరం ఉన్నదని తెలియజేయడానికి ఊరికి దూరంగా, సముద్రతీరాన ఒక దీపస్థంభం ఉండేది.

చీకటి పడగానే దీపస్థంభం మీద ఏర్పాటుచేయబడిన దీపమును వెలిగించేవారు. దీపము యొక్క కాంతి అన్ని దిశలలోను ప్రసరించునట్లు దీపం చుట్టూ అద్దాలు అమర్చ బడి ఉండేవి. అలాగే సాధ్యమైనంత ఎక్కువ దూరము వరకు ప్రయాణించునట్లు దీపస్థంభం చాలా ఎత్తుగా ఉండేది. చీకటి పడగానే దీపస్థంభం ఎక్కి అద్దమును ఎత్తి దీపమును వెలిగించి మరల అద్దము యొక్క స్థానాన్ని సరిచేసి, దీపము యొక్క వెలుగు అన్ని దిశలలో సరిగా ఉన్నదో లేదో చూచుటకు, తెల్లవారే సమయానికి మరలా దీపస్థంభం ఎక్కి దీపము ఆర్పివేయుటకు బాధ్యతాయుతమైన వ్యక్తులను ప్రభుత్వం నియమించి వారికి జీతభత్యాలను ఇచ్చేది.

న్యూజెర్సీ ప్రాంతంలో ఆర్థర్ అనే చిన్న బాలుడు ఉండేవాడు. అతని తండ్రికి దీపస్థంభంలోని దీపమును వెలిగించే పని. వీరు ఊరికి దూరంగా, సముద్ర తీరానికి దగ్గరగా, ఒంటిగా ఉన్న దీపస్థంభం క్రింది గదుల్లో కాపురం ఉండేవారు. తండ్రి ప్రతిరోజు సాయంత్రం ఆ పెద్ద దీపాన్ని వెలిగించి ఉదయమవగానే ఆర్పివేసేవాడు.

ఒకసారి ఆర్థర్ తల్లి బంధువుల్ని చూడడానికి ఊరు వెళ్ళింది. ఆ సాయంత్రం తండ్రి ఆహారం కోసం చేపలు పట్టి తెస్తానని, చీకటిపడేలోపు వచ్చేస్తానని చెప్పి గాలం తీసుకొని నావలో సముద్రంపైకి వెళ్ళాడు. దీపస్థంభం వద్ద ఆ చిన్న బాబు మాత్రం ఉన్నాడు. అది వారికి మామూలే.

ఆర్థర్ తండ్రి రెండు మైళ్ళు వెళ్ళాక, అకస్మాత్తుగా పెద్ద తుఫాను మొదలై ఆయన చిన్న దోనెను దూరంగా నెట్టివేసింది. ఎంత ప్రయత్నించినా ఫలితంలేకపోయింది. ఆకాశం నల్లగా మేఘాలతో కప్పబడింది. అతనికి ఎటు పోవాలో తెలియడం లేదు,అంతా అయోమయంగా ఉంది. జోరున ఒకటే వర్షం. ఇంట్లో ఒంటరిగా ఉన్న ఆర్థర్ గుర్తుకు వచ్చాడు. పిల్లాడు కంగారుపడి ఏడుస్తుంటాడేమో! తోడు ఎవ్వరూ లేరు. సమయమెంతైందో తెలీదు. అంతేకాక దీపస్థంభం వెలిగించలేదు. తనవలె సముద్రంలో చిక్కుకున్న ఓడ ఏదైనా ఈ గాలికి కొట్టుకు వచ్చి, బండలకు ఢీకొని బ్రద్దలై పోవచ్చు. అది ప్రభుత్వం దృష్టిలో క్షమించరాని నేరం. ఏం చేయాలో తోచక, “దేవా! ఈ సమయంలో నీవు తప్ప వేరే దిక్కు లేదు” అని ఏడుస్తుండగా, అకస్మాత్తుగా దీపస్థంభం నుండి వెలుగు కిరణాలు కారు చీకట్లో నిరీక్షణ జ్యోతిలా ప్రకాశింపసాగాయి.

ఎవరా పెద్ద దీపాన్ని వెలిగించి ఉంటారు?అని ఆశ్చర్యపోతూ, తండ్రి శక్తి కొలది తెడ్లు వేస్తూ శరవేగంతో దీపస్థంభం చేరుకొని “దీపం వెలిగించిందెవరు?” అని బిగ్గరగా అరిచాడు. చీకట్లో “ నేనే నాన్న” అనే మాటలు వినిపించాయి. తండ్రి ఆనందానికి హద్దులు లేవు. పరుగున మెట్లెక్కి , బాబును ఎత్తుకొని, కౌగిలించుకొని ముద్దాడాడు.

గాలి ఎక్కువ కావడం, కారుచీకటి కమ్ముకోవడం చూసిన ఆ చిన్నవాడు తన తండ్రి సమయానికి దీపం వెలిగించలేడని గ్రహించి అగ్గిపెట్టె జేబులో వేసుకొని సుమారు రెండు తాటిచెట్లు ఎత్తున్న ఆ దీపస్థంభాన్ని మెల్లగా మెట్టు తరువాత మెట్టు పైకి ప్రాకి ఎక్కి ఒత్తిని పైకి ఎత్తి పెద్ద చక్రంలాంటి దాన్ని కొంచెం త్రిప్పి అద్దం కిటకీ ఎత్తి దీపం అంటించాడు. ఆ పెద్ద దీపం వెలిగింది. ఆ చిన్న బిడ్డ దీపస్థంభాన్ని వెలిగించడం ద్వారా, తండ్రిని రక్షించాడు. వెలుగు లేకపోతే జరిగే ప్రమాదాల నుండి ఓడలను రక్షించాడు.

దేవుని వాక్యం మానవ జీవితాలలో నిజమైన వెలుగు. ఎప్పుడైతే ఆ వెలుగు మన హృదయంలో ఉంటుందో, అప్పుడు మాత్రమే మనం ఈ లోకంలో సురక్షితంగా ఉండగలము. మన గమ్యాన్ని చేరుకోగలము.

నీ వాక్యము నా పాదములకు దీపమును నా త్రోవకు వెలుగునైయున్నది. కీర్తనలు 119:105


# బైబిల్ ప్రాముఖ్యత

సర్వశక్తిగల దేవుడు, భూమ్యాకాశములను, సృష్టిలోని సమస్తమును తన వాక్కు చేత సృష్టించిన దేవుడు, ఆయన ఇష్టపడి తన స్వరూపములో తన పోలికె చొప్పున చేసుకొనిన మనుష్యుల కొరకు సమస్తమును అను గ్రహించాడు. మనుష్యులను రక్షించడానికి చివరకు తన ప్రియ కుమారుని సైతం బలిగా అర్పించాడు. అంతగా ప్రేమించిన మనిషి కొరకు ఒక గ్రంథమును వ్రాయించాడంటే, ఆ గ్రంథము ఎంత విలువైనదో, ఎంత ఉన్నత ప్రమాణాలతో సిద్ధపరిచాడో ఆ గ్రంథమును ఆమూలాగ్రం అధ్యాయనం చేస్తే తప్ప అర్థం కాదు. పరిశుద్ధ గ్రంథము యొక్క గొప్పతనం ఎంటో, అది ఎలా ఆవిర్భవించిందో తెలుసుకోవాల్సిన అవసరతల ప్రతి ఒక్కరికీ ఉంది. ఎందుకంటే భూమి మీద జన్మించిన ప్రతి మనిషి కొరకు సిద్ధపరచబడిన గ్రంథము కాబట్టి. ఈ పరిశుద్ధ గ్రంథమును ఎందుకు చదవాలో ఈ పుస్తకం చదివిన తరువాత మీరు గ్రహించగలరని ఆశిస్తున్నాము.

**బైబిలు చరిత్ర, ఆవిర్భావం:**

ఐక్యరాజ్యసమితిలో నమోదు చేయబడిన 160 దేశాలలో మరియు తదితర దేశాలలోని 822 కోట్లకు పైగా ఉన్న ప్రపంచ జనాభాలో ఎన్నో మతాలు వాటికి ఎన్నో మత గ్రంథములు ఉన్నవి. ఈ మత గ్రంథములన్నిటిలో విరివిగా వాడబడుచున్న గ్రంథము బైబిలు. బైబిలు అను ఇంగ్లీషు పదము బిబ్లియోన్ అను గ్రీకు పదము నుండి వచ్చినది. బిబ్లియోన్ అనగా గ్రంథము అని అర్థం. ఈ గ్రంథము చీకటిగల చోటున వెలుగిచ్చు దీపమువలె ఉండును. ఈ వాక్యము మనుష్యుల స్వంత ఇచ్ఛనుబట్టి కలుగలేదు గాని పరిశుద్ధాత్మ ప్రేరేపణ వలన ప్రేరేపించబడి పలుకబడిన వాక్యము. ఈ పలికిన మాటలు పరిశుద్ధుల ద్వారా వ్రాయబడి భద్రము చేయబడినవి (2పేతురు 1:19-21). పౌలు తిమోతికి వ్రాసిన రెండవ పత్రిక 3:16నుబట్టి ఈ వాక్యము దైవావేశము వలన కలిగినది. అందుకే దీనిని పరిశుద్ధ గ్రంథము అన్నాము. ఇది దేవునిచే పలుకబడిన వాక్కు ఆదికాండము మొదటి అధ్యాయం చూచినట్లైతే.... దేవుడు పలుకగా ఆ ప్రకారమాయెనను విషయమును మనము గమనించగలం. ఆయనే వాక్యము అను విషయం యోహాను వ్రాసిన సువార్త మొదటి అధ్యాయము మొదటి వచనములో గమనించగలం. ఆయనలో జీవము ఉండెను. అనగా ఆయన వాక్యములో జీవముండెను. యేసుక్రీస్తు వారు సమరయ స్త్రీతో పలికిన పలుకులు గమనించండి. యోహాను వ్రాసిన సువార్త 4:10లో తనను తాను దేవుని వరముగా పరిచయం చేసికొనినాడు. నీవు నన్ను ఎరిగి యుంటే, నీవు నన్ను అడిగినట్లైతే నీకు నేను జీవజలము ఇచ్చెదను అను విషయమును వారి సంభాషణలో మరియు అదే అధ్యాయం 14 వచనంలో నేను ఇచ్చు నీళ్ళు నిత్య జీవమునకై వానిలో ఊరెడి నీటి బుగ్గగా ఉండునని ఆమెతో చెప్పెను. ఆయనలో, ఆయన వాక్యములో జీవము, నిత్యజీవము ఉన్నది.

**బైబిల్ పద వినోదము-6 జవాబులు**



**జవాబులు పంపినవారు :**

1. బి. ప్రేమలత- నెల్లూరు, 2. క్రిస్టియానమ్మ- నంది కొట్కూరు, 3. బి. సరోజిని- గుంతకల్లు, 4. శ్రీమాన్విక - బొమ్మూరు, 5. యేసురత్నం-ఒంగోలు, 6. శాంతకుమారి- కొత్తపేట, 7. రంజిత్‌సింగ్ రామానుజులు-ఒంగోలు, 8. డి. సాల్మన్‌రాజు-నంద్యాల, 9. టి. యేసుదయమ్మ- వలపర్ల, 10. ఏ. సౌమ్య-నందిగామ, 11. దయరాజు- రామానుజపురం, 12. మేరి పవిత్ర-మంచిర్యాల, 13. పి. విజయకుమారి- ఒంగోలు

# బైబిల్ పద వినోదం - 07

## ఇస్సాకు

ఈ క్రింది పదాలను ప్రక్కనున్న అక్షరాలలో వెదకండి. పదాలు అడ్డంగా, నిలువుగా, క్రాస్‌గా ఉండవచ్చు, కానీ పదాలు ఒకదాని మీదగా ఇంకొకటి గుర్తించకూడదు. గుర్తించిన క్రింది పదమును (✓) టిక్ పెట్టండి

| | | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| మో | అ | దె | బో | రా | హి | అ | ప | ని | యీూ | డు | కా | లు | వి | రి |
| శి | రీ | బా | ల | లు | త్తీ | మ | ము | త్య | బా | రే | జ | అ | బ్కా | స |
| ప | హే | యా | జ | ర | యు | ర | ర | దే | వు | త | బె | యే | ర్షె | బా |
| రి | జ | తు | ట | హె | లు | ణ | గా | వు | లు | వా | గ్దా | న | ము | దా |
| శో | ఏ | శా | వు | బో | ఒం | శి | బం | డు | అ | హు | జ | తు | ది | మ |
| ధిం | అ | గొ | షే | తు | టె | క్ష | అ | మ | నో | వే | ద | న | అ | డి |
| చు | న | ద్రా | మై | బ | లు | అ | ఇ | స్సా | కు | అ | ర | ణ్య | ము | మె |
| ట | న | లు | అ | యా | కో | బు | వే | ల | అ | ము | రా | న | ద్ద | ప |
| అ | తృ | ణీ | క | రిం | చు | ట | ట | సా | ధు | వు | కీ | డు | శి | అ |
| గొ | ద | హ | న | బ | లి | ట | గా | అ | ప్ర | జ్యే | ష్ఠ | త్వ | ము | త్నా |
| ట్టె | ము | అ | ఎ | దో | ము | వం | డు | అ | యా | అ | బ | య | డ | ము |
| పి | ల | అ | క | రు | వు | ర | లు | కు | ణ | బా | లి | హూ | అ | ణ |
| ల్ల | ఫ | క | ర | ణ్య | ము | గూ | యే | శె | ము | శె | పీ | దీ | అ | మా |
| అ | స | లా | బా | ను | అ | ల | తూ | ఏ | అ | మ | ర | తు | మి | ప్ర |
| సి | రి | యా | బే | యే | రీ | క | బె | అ | వ | తు | ము | అ | గ | ల్కా |

పేరు.......................................గ్రామము.......................................

అడ్రస్ లేబుల్ మీద ఉన్న బుక్ సీరియల్ నంబరు.......................................

**'బైబిలు పద వినోదము-06'** పూర్తి చేసిన తర్వాత ఈ పేజీని ఫోటో తీసి అడ్రస్ లేబుల్ మీద ఉన్న బుక్ సీరియల్ నంబరు వ్రాసి 9440217726 నంబరుకి వాట్సాప్ ద్వారా పంపగలరు లేదా ఈ పేజీని జెరాక్స్ తీసి **15వ తేదీలోగా** మా అడ్రసుకు పంపగలరు. సీరియల్ నంబరు వేయకుండా పంపిస్తే, వారి పేరు ప్రచురింపబడదు.

| | | | | |
|---|---|---|---|---|
| ఇస్సాకు | ప్రమాణము | లాబాను | ఏశావు | అహుజతు |
| రిబ్కా | బెయేర్షెబా | ప్రయాణము | మడిమె | మరణశిక్ష |
| సిరియా | అరణ్యము | కీడు | వేటగాడు | బావులు |
| మిల్కా | విలుకాడు | సఫలము | బేయేరీ | ఏశెకు |
| బెతూయేలు | నిత్యదేవుడు | దాది | సాధువు | రహెబోతు |
| మోరీయా | యీూరే | దెబోరా | కలగూరవంట | శిత్నా |
| పరిశోధించుట | వాగ్దానము | ఒంటెలు | ఎదోము | బాశెమతు |
| దహనబలి | హేతు | పద్దనరాము | జ్యేష్ఠత్వము | మనోవేదన |
| బలిపీఠము | షేబ | గొద్రాలు | తృణీకరించుట | గొట్టెపిల్ల |
| బంగారము | యాకోబు | యహూదీతు | హిత్తీయులు | కరవు |